www.prajavinikidi.com

RNI.No :TELTEL/2023/85745

# ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం

తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న

ప్రజా వినికిడి

మా అక్షరం-మీ ఆయుధం  తెలుగు దినపత్రిక

తెలుగు దినపత్రిక నందు పనిచేయుటకు

జర్నలిజంపై ఆసక్తి కలిగిన విలేఖరులు కావలెను

ఆసక్తి గలవారు సంప్రదించండి

8978701613,7013016545

సంపుటి - 4  సంచిక -135  శనివారం 29 ఆగస్టు 2026  ఎడిటర్ : మారేపల్లి అశోక్  పేజిలు 8 వెల - 3/-  01

Published From Hyderabad : Cerculated in Hyderabad Rangareddy,Nalgonda,Khammam,Warangal,Mahaboobnagar,Medak and All Distircts


## వివాదంవేళ..
# రక్షాబంధన్



**సీఎంకు రాఖీ కట్టిన మంత్రి కొండా సురేఖ**

**ముఖ్యమంత్రికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుందంటూ వ్యాఖ్యలు**

**టీపీసీసీ నోటీసుల నేపథ్యంలో ఆసక్తికర చర్చ**



**హైదరాబాద్ ఆగస్టు 28(ప్రజావినికిడి):**
రక్షా బంధన్ సందర్భంగా మంత్రులు కొండా సురేఖ, సీతక్క ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నివాసానికి వెళ్లి రాఖీ కట్టారు. పరకాల వివాదం తర్వాత కొండా సురేఖ.. సీఎం నివాసానికి వెళ్లడం ఇదే తొలిసారి. సీఎంతో భేటీ అనంతరం కొండా సురేఖ మీడియాతో మాట్లాడకుండానే అక్కడి నుంచి వెళ్లి పోయారు. అనంతరం తన నివాసంలో కొండా సురేఖ మీడియాతో మాట్లాడారు. "సీఎం రేవంత్‌రెడ్డికి మూడోసారి రాఖీ కట్టా. నేను అందరికీ సోదరినే. పండుగ వాతావరణంలో ఎలాంటి రాజకీయ వ్యాఖ్యలు చేయను. ముఖ్యమంత్రికి మహిళల అండ ఎప్పుడూ ఉంటుంది. రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే శక్తి ఆయనకు ఇవ్వాలని దేవుడిని కోరుకున్నా. ఆడబిడ్డల ఆశీర్వాదాలు సీఎంకు ఎప్పుడూ ఉండాలని కోరుకున్నా" అని తెలిపారు.ఇటీవల.. ములుగు, పరకాలలో జరిగిన కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు. అయితే ఈ కార్యక్రమాల్లో వరంగల్ జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహిస్తోన్న కొండా సురేఖ పాల్గొనలేదు. ముఖ్యమంత్రి పర్యటనలో స్థానిక**మిగతా 2లో...**

## పొంచి ఉన్న మరో
# వరద ముప్పు

**నేపాల్‌లో 547కు చేరిన మృతులు**




**ఖాట్మండు : ఆగస్టు 28(ప్రజావినికిడి):**
నేపాల్‌లో పెను విషాదాన్ని మిగిల్చిన వరదలలో మరణించిన వారి సంఖ్య శుక్రవారం 547కు చేరింది. సహాయ కార్యక్రమాలు కొనసాగు తుండడంతో శిథిలాల నుంచి మరిన్ని మృతదేహాలు బయటపడుతున్నాయి. భోటెకోషి నది ప్రాంతంలో నీటి మట్టం పెరుగుతుండడంతో మరోసారి వరద ముప్పు పొంచి ఉన్నదన్న ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. రెండు రోజుల క్రితం ఆకస్మికంగా ముంచుకొచ్చిన వరదలతో తీవ్ర నష్టం వాటిల్లిన ప్రదేశంలో నీటి మట్టాలు పెరుగుతున్నాయని, దీంతో ఆ ప్రాంతంలో మళ్లీ వరదలు సంభవించే అవకాశం ఉన్నదని **మిగతా 2లో...**

## రక్షణ రంగంలో మరో ముందడుగు

**అమెరికాతో రక్షణ శాఖ జావెలిన్ కొనుగోళ్లు**

**న్యూఢిల్లీ,ఆగస్టు 28 (ప్రజావినికిడి):**
భారత్ - అమెరికా రక్షణ రంగంలో మరో ముందడుగు పడింది. యుఎస్ నుంచి 'జావెలిన్' యాంటీ ట్యాంక్ క్షిపణుల కొనుగోలుకు ఇరు దేశాల అధికారులు ఒప్పందం చేసుకున్నారు. ఈ మేరకు అమెరికా ఫారిన్ మిలిటరీ సేల్స్ **మిగతా 2లో...**



## బిసి, ఇబిసి విద్యార్థులకు చేయూత

**విదేశీ విద్యకోసం తెలంగాణ ప్రభుత్వం ఆర్థిక సాయం**

**సెప్టెంబర్ 1 నుంచి 30 వరకు దరఖాస్తులను స్వీకరణ**

**హైదరాబాద్, ఆగస్టు 28(ప్రజావినికిడి):**
విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనుకునే బీసీ, ఈబీసీ విద్యార్థులకు తెలంగాణ ప్రభుత్వం శుభవార్త అందించింది. మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యానిధి పథకం కింద దరఖాస్తులను ఆహ్వానించింది. ఈ విడతలో మొత్తం 350 మంది విద్యార్థులను ఎంపిక చేయనున్నారు**మిగతా 2లో...**



# సెప్టెంబర్ 2 నుంచి బీఆర్ఎస్ పోరుబాట

**వారం రోజుల పాటు కాంగ్రెస్ మోసంపై ప్రచారం**

**పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపు**

**హైదరాబాద్ ఆగస్టు 28 (ప్రజావినికిడి):**
కాంగ్రెస్ పార్టీ వెయ్యి రోజుల అసమర్థ పాలనపై సెప్టెంబర్ 2నుంచి వారం రోజుల పాటు బీఆర్ఎస్ చేపట్టిన పోరుబాటను విజయవంతం చేయాలని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్ నుంచి పార్టీ సీనియర్ నేతలు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. సెప్టెంబర్ 2న ఆరు గ్యారెంటీల వైఫల్యంపై నియోజకవర్గ కేంద్రాల్లో ధర్నాలు, 3న వ్యవసాయ విధ్వంసంపై అన్ని నియోజకవర్గాల్లో రైతు సదస్సులు,**మిగతా 2లో...**





## చరిత్ర సృష్టించిన
# ప్రజ్ఞానంద

**గ్రాండ్ చెస్ టూర్ టైటిల్ కైవసం**

**సెయింట్ లూయిస్ఆగస్టు 28(ప్రజావినికిడి):**
భారత యువ గ్రాండ్‌మాస్టర్ రమేష్‌బాబు ప్రజ్ఞానంద చెస్‌లో అంచనాలకు మించి రాణిస్తున్నాడు. అమెరికా వేదికగా జరుగుతున్న గ్రాండ్ చెస్ టూర్ టైటిల్ కైవసం చేసుకొని ఈ టైటిల్ సాధించిన తొలి భారతీయ గ్రాండ్‌మాస్టర్‌గా చరిత్ర సృష్టించాడు. గ్రాండ్ ఫైనల్‌లో అమెరికాకే చెందిన ఫాబియానో **మిగతా 2లో...**

## 2047 నాటికి 50 శాతం
# పచ్చదనమే లక్ష్యం

**గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ గా నాగబాబు బాధ్యతలు**

**మంగళగిరిలోని అరణ్యభవన్ లో బాధ్యతలు స్వీకరించిన నాగబాబు**

**కేబినెట్ హోదాతో గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ చైర్మన్ పదవి**

**బాధ్యతల స్వీకరణ కార్యక్రమంలో పాల్గొన్న నాగబాబు అర్ధాంగి పద్మజ**



2లో.

## తెలంగాణలో అంగన్‌వాడీ
# ఉద్యోగాల జాతర..

**ఇంటర్ అర్హతతో 15,982 పోస్టుల భర్తీ**

**సెప్టెంబర్ నాటికి నియామకాలు పూర్తి చేయాలని ప్రభుత్వ ఆదేశం**

**ఇంటర్ పాసైన వారు అర్హులు, ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థుల ఎంపిక**

**ఎంపికలో ఇంటర్ మార్కులకు 70 శాతం వెయిటేజీ**

**రెండు జోన్ల పరిధిలో టీచర్లు, ఆయాల పోస్టుల భర్తీ**



**హైదరాబాద్,ఆగస్టు 28 (ప్రజావినికిడి):**
తెలంగాణ ప్రభుత్వం రాష్ట్రంలోని నిరుద్యోగులకు శుభవార్త చెప్పింది. రాష్ట్రవ్యాప్తంగా అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న భారీ సంఖ్యలో పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఈ మేరకు మొత్తం 15,982 పోస్టులను సెప్టెంబర్ నెలలోగా భర్తీ చేయాలని అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేసింది.ప్రభుత్వ ఉత్తర్వుల ప్రకారం,**మిగతా 2లో...**




# మహిళల పేరిటే ఉచిత రిజిస్ట్రేషన్

పదేండ్ల తర్వాత పూర్తి హక్కులు

హైదరాబాద్ క్యూర్ పరిధిలో పేదలకు ఆత్మగౌరవ ఇండ్లు

రాజకీయాలకతీతంగా లాటరీ విధానంలో 480 ఇందిరమ్మ

ఫ్లాట్ల కేటాయింపు :మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

నాంపల్లిలో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల లాటరీ ప్రక్రియ

2లో.

# పొంచి ఉన్న మరో వరద ముప్పు

మొదటిపేజీ తరువాయి

నేషనల్ డిజాస్టర్ రిస్క్ రిడక్షన్ అండ్ మేనేజ్‌మెంట్ అథారిటీ (ఎన్‌డీఆరఆరఎంఏ) తెలిపింది. బుధవారం వరదలు సంభవించిన ప్రాంతంలోనే బురదతో కూడిన నీటి మట్టం పెరిగిందని, కాబట్టి ఆ ప్రదేశాన్ని మరోసారి వరద నీరు ముంచెత్తవచ్చునని హెచ్చరించింది.

**భారత పర్యాటకులను కలిసిన రాయబారి**

వరదల కారణంగా హిమాలయ ప్రాంతాల నుంచి ఖాళీ చేయించిన భార తీయ పర్యాటకులను నేపాల్‌లోని భారత రాయబారి శ్రీవాత్సవ శుక్రవారం కలుసు కున్నారు. ఇండిగో విమానంలో ఖాట్మండు నుంచి భారత్‌కు బయలుదేరిన పర్యాటకులకు ఆయన త్రిభువన్ అంతర్జా తీయ విమానాశ్రయంలో వీడ్కోలు పలి కారు. ఇదిలావుండగా టిబెట్‌లోని చైనా నేపాల్ సరిహద్దులో సంభవించిన వరదల్లో ఐదుగురు చనిపోయారని, 260 మంది విదేశీయులు సహా 558 మంది జాడ తెలియడం లేదని చైనా తెలిపింది. కాగా విపత్తు సహాయ నిధికి నెల జీతం విరాళంగా అందించాలని నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన క్యాబినెట్ సహచరులు నిర్ణయించారు. శుక్రవారం జరిగిన క్యాబినెట్ సమావేశంలో ఈ మేరకు నిర్ణయం తీసుకున్నారని ఖాట్మండు పోస్ట్ పత్రిక తెలియజేసింది. ఆకస్మిక వరదలలో నష్టపోయిన వ్యక్తులు, వ్యాపారుల కోసం సహాయ, ఆర్థిక, పునరావాస ప్యాకేజీని రూపొందించాలని ఆర్థిక మంత్రిత్వ శాఖను క్యాబినెట్ ఆదేశించింది.

# చరిత్ర సృష్టించిన ప్రజ్ఞానంద

మొదటిపేజీ తరువాయి

కారౌనాను ఓడించాడు. ఆరంభంలో వెనుకబడ్డ ప్రజ్ఞానంద.. ఆ తర్వాత అద్భుతంగా పుంజుకున్నాడు. చివరకు 15-13 స్కోరుతో ఫాబియానోపై విజయం సాధించాడు. జీసీటీ టైటిల్‌ను ప్రజ్ఞానంద గెలవడం ఇదే తొలిసారి. ఈ గెలుపుతో ప్రజ్ఞానందకు రెండు లక్షల డాలర్ల ప్రైజ్‌మనీ దక్కింది. చివరి రోజు ఆరు పాయింట్ల లోటుతో ఉన్న ప్రజ్ఞానంద .. కారౌనాతో జరిగిన రెండు ర్యాపిడ్ గేమ్స్‌లో విజయం సాధించాడు. ఇక ఆ తర్వాత బ్లిట్జ్ సెక్షన్‌లోనూ అద్భుత ప్రదర్శన ఇచ్చి 15-13తో టైటిల్ గెలుచుకున్నాడు. తొలి క్లాసికల్ గేమ్‌లో ప్రజ్ఞా ఓడిపోయాడు. 6-0 తేడాతో ఆ గేమ్‌లో పరాజయాన్ని చూవి చూశాడు. ఆ తర్వాత రెండో క్లాసికల్ గేమ్‌ను అతను డ్రా చేసుకున్నాడు. 3-3 పాయింట్లతో ఆ గేమ్ డ్రా అయ్యింది. అయితే ఆఖరి రోజు 6 పాయింట్ల అడ్వాంటేజ్‌తో అమెరికా ప్లేయర్ ముందున్నాడు. కానీ ర్యాపిడ్ గేమ్స్‌తో ప్రజ్ఞా మొత్తం మార్చేశాడు.

**కాంటినెంటల్ ఛాంపియన్ సరయు:**భారత సంతతికి చెందిన చిన్నారి సరయు తలపనేని అంతర్జాతీయ చెస్‌లో అరుదైన ఘనత సాధించింది. కొలంబియాలోని మెడెలిన్‌లో జరిగిన క్లాసికల్ చెస్ పాన్-అమెరికన్ పోటీల్లో 9కి 9 పాయింట్లు సాధించి కాంటినెంటల్ ఛాంపియన్‌గా నిలిచింది. వారం రోజుల పాటు జరిగిన ఈ పోటీల్లో సరయు తొమ్మిది రౌండ్లు ఆడింది. ఉత్తర, దక్షిణ, మధ్య అమెరికాలకు చెందిన ఏడు దేశాల క్రీడాకారులతో తలపడింది. ఒక్క గేమ్‌లోనూ ఓటమి లేకుండా పర్ఫెక్ట్ స్కోర్‌తో టైటిల్ సొంతం చేసుకుంది. ఈ విజయంతో అమెరికా తరఫున పాల్గొన్న అతి పిన్న వయస్కులైన బాలికల్లో ఒకరిగా గుర్తింపు పొందింది. అలాగే ఈ ఏడాది చివర్లో జరిగే యూత్ చెస్ వరల్డ్ కప్‌లో అమెరికాస్ తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కించుకుంది. ఫిడే విమెన్ క్యాండిడేట్ మాస్టర్ టైటిల్‌కు అవసరమైన అర్హతను తాత్కాలికంగా సాధించిన అతి పిన్న వయస్కుల్లోనూ సరయు ఒకరిగా నిలిచింది.

# రక్షణ రంగంలో మరో ముందడుగు

మొదటిపేజీ తరువాయి

పక్రియ ద్వారా లెటర్ ఆఫ్ ఆఫర్ అండ్ యాక్సెప్టెన్స్‌పై భారత అధికారులు సంతకం చేశారు. 'జావెలిన్' డీల్‌తో ఇరుదేశాల మధ్య సరికొత్త అధ్యాయం మొదలైందని అమెరికా రాయబారి సెర్గియో గోర్ తెలిపారు. భారత్‌లో జావెలిన్ క్షిపణుల సంయుక్త ఉత్పత్తికి మార్గం సుగమం అయ్యే అవకాశం ఉందని వెల్లడించారు. క్షిపణులను ప్రయోగించిన తర్వాత మళ్లీ గైడ్ చేయక్కర్లేని 'ఫైర్ అండ్ పర్గెట్' ఆటోమేటిక్ టెక్నాలజీతో జావెలిన్ మిస్సైళ్లు పనిచేస్తాయని వివరించారు. శత్రు దేశాల ట్యాంకులు, బంకర్లకు చెక్ పెట్టేలా భయానక టెక్నాలజీ అందుబాటులోకి వస్తుందని చెప్పుకొచ్చారు. చైనా, పాకిస్థాన్ సరిహద్దుల్లో శత్రువుల ట్యాంకులు, బంకర్లు, సాయుధ వాహనాలను ధ్వంసం చేయడంలో ఈ ఆయుధాలు కీలక పాత్ర పోషిస్తాయని అమెరికా రాయబారి సెర్గియో గోర్ పేర్కొన్నారు.

# బిసి, ఇబిసి విద్యార్థులకు చేయూత

.మొదటిపేజీ తరువాయి

ఇందులో 250 మంది బీసీ విద్యార్థులు, 100 మంది ఈబీసీ విద్యార్థులకు అవకాశం కల్పించనున్నారు.సెప్టెంబర్ 1 నుంచి 30వ తేదీ వరకు దరఖాస్తులను స్వీకరించనున్నారు. అర్హత కలిగిన విద్యార్థులు నిర్ణీత గడువులోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించింది. దరఖాస్తులను తెలంగాణ ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా సమర్పించాల్సి ఉంటుంది. ఈ పథకం ద్వారా విదేశాల్లో పోస్ట్ గ్రాడ్యుయేషన్, పీహెచ్‌డీ వంటి ఉన్నత విద్యా కోర్సులను అభ్యసించేందుకు అర్హులైన విద్యార్థులకు అవకాశం లభిస్తుంది. ఈ పథకానికి దరఖాస్తు చేసుకునే విద్యార్థుల కుటుంబ వార్షిక ఆదాయం రూ.5 లక్షల్లోపు ఉండాలి. దరఖాస్తుదారుల వయస్సు 35 సంవత్సరాల్లోపు ఉండాలి.విద్యార్థులు తమ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 60 శాతం మార్కులు సాధించి ఉండాలి. జిఆర్‌ఇ, జిమాట్ స్కోర్‌తో పాటు టోఫెల్ తదితర పరీక్షల్లో అవసరమైన స్కోర్ సాధించి ఉండాలి. విదేశాల్లో ఉన్నత విద్యను అభ్యసించాలనే లక్ష్యం ఉన్న బీసీ, ఈబీసీ విద్యార్థులకు మహాత్మా జ్యోతిబా ఫూలే ఓవర్సీస్ విద్యానిధి మంచి అవకాశాన్ని అందిస్తోంది.

---------------

# తెలంగాణలో అంగన్‌వాడీ ఉద్యోగాల జాతర..

మొదటిపేజీ తరువాయి

ఈ నియామకాలు జిల్లా స్థాయిలో జరగనున్నాయి. మొత్తం ఖాళీలలో జోన్-1 పరిధిలో 1,853 టీచర్ పోస్టులు, 7,737 ఆయా పోస్టులు ఉన్నాయి. జోన్-2 పరిధిలో 1,247 టీచర్ పోస్టులు, 5,145 ఆయా పోస్టులను భర్తీ చేయనున్నారు. ఈ పోస్టులకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులు ఇంటర్మీడియట్ (ఇంటర్) ఉత్తీర్ణులై ఉండాలని ప్రభుత్వం స్పష్టం చేసింది.

అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ఇంటర్వ్యూ ద్వారా జరగనుంది. ఎంపికలో భాగంగా అభ్యర్థుల ఇంటర్మీడియట్‌లో సాధించిన మార్కులకు 70 శాతం వెయిటేజీ ఇవ్వనున్నారు. ఇంటర్వ్యూకు 10 శాతం మార్కులు కేటాయించారు. అలాగే, ప్రత్యేక కేటగిరీల కింద వితంతువులకు 5 శాతం, అనాథలకు 10 శాతం, దివ్యాంగులకు 5 శాతం చొప్పున వెయిటేజీ కల్పించనున్నారు. ఈ నియామక ప్రక్రియను వేగవంతం చేసి, సెప్టెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్దేశించింది. ఈ నిర్ణయంతో వేలాది మంది నిరుద్యోగ మహిళలకు ఉపాధి అవకాశాలు లభించనున్నాయి.

# ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ డిజిటల్ ప్రాజెక్ట్

## విశాఖ కేంద్రంగా గూగుల్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్

**అమరావతి,ఆగస్టు 28 (ప్రజావినికిడి):** ఆంధ్రప్రదేశ్‌కు మరో భారీ డిజిటల్ ప్రాజెక్ట్ దక్కింది. ముంబై, చెన్నై తర్వాత దేశంలో మూడో అతిపెద్ద డిజిటల్ ల్యాండింగ్ హబ్‌గా ఏపీ అవతరించనుంది. సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్స్ నిర్మాణంలో గూగుల్, మైక్రోసాఫ్ట్ వంటి టెక్ దిగ్గజాలు భాగస్వామ్యం కానున్నాయి. విశాఖపట్నం కేంద్రంగా గూగుల్ కేబుల్ ల్యాండింగ్ స్టేషన్‌తో పాటు ఎఐ ఫెసిలిటీ అందుబాటులోకి రానుంది. మైక్రోసాఫ్ట్, లైట్‌స్టార్మ్, సింగ్‌టెల్ భాగస్వామ్యంతో సుమారు 3,600 కిలోమీటర్ల పొడవైన సముద్రగర్భ కేబుల్ వ్యవస్థను ఏర్పాటు చేయనున్నారు. ఈ కేబుల్ ద్వారా విశాఖపట్నానికి సింగపూర్, ఆగ్నేయాసియా ప్రాంతాలతో నేరుగా కనెక్టివిటీ ఏర్పడనుంది. 2029 ఆఖరు నాటికి మైక్రోసాఫ్ట్-లైట్‌స్టార్మ్ సముద్రగర్భ ఇంటర్నెట్ కేబుల్ నెట్‌వర్క్ అందుబాటులోకి రానుంది. మచిలీపట్నం-హైదరాబాద్-ముంబై, చెన్నై-హైదరాబాద్-ముంబై మార్గాల్లో కొత్త అంతర్గత డిజిటల్ ÷బైర్ నెట్‌వర్క్‌ను అభివృద్ధి చేయనున్నారు. దీంతో విశాఖపట్నం అంతర్జాతీయ డిజిటల్ గేట్‌వేగా మారే అవకాశం ఉంది. విశాఖపట్నం కేంద్రంగా గూగుల్ 'అమెరికా-ఇండియా కనెక్ట్' సబ్‌సీ కేబుల్‌ను ఏర్పాటు చేయనుంది. విశాఖ గూగుల్ సెంటర్‌లో పవర్-హంగ్రీ ంఎ మోడల్స్ కంటే ంఎ ఇన్ఫరెన్సింగ్, క్లౌడ్ సేవలకే మొగ్గు చూపనున్నట్లు తెలుస్తోంది. పర్యావరణ పరిరక్షణలో భాగంగా విశాఖ ఫెసిలిటీలో పునరుత్పాదక విద్యుత్, ఎయిర్ కూలింగ్ టెక్నాలజీలను గూగుల్ ఉపయోగించుకునే అవకాశం ఉంది. పశ్చిమాసియాలో కొనసాగుతున్న రాజకీయ అశాంతి నేపథ్యంలో సురక్షిత డిజిటల్ కారిడార్‌గా భారత తూర్పు తీరం రూపుదిద్దుకోనుంది.

# 2047 నాటికి 50 శాతం పచ్చదనమే లక్ష్యం

**మంగళగిరి, ఆగస్టు 28 (ప్రజావినికిడి):**

ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా నాగబాబు బాధ్యతలు స్వీకరణ అనంతరం మీడియాతో మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న అటవీ, వృక్ష సంపదను విస్తరించి 2047 నాటికి మొత్తం భౌగోళిక విస్తీర్ణంలో పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యంగా బాధ్యతలు నిర్వర్తిస్తానని తెలిపారు. పర్యావరణ పరిరక్షణను కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా కాకుండా ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే మహోద్యమంగా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. "ఏపీ గ్రీన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ ఛైర్మన్ గా బాధ్యతలు స్వీకరించడం ఎంతో గౌరవంగా, బాధ్యతగా భావిస్తున్నాను. తనపై నమ్మకం ఉంచి ఈ కీలక బాధ్యతలను అప్పగించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు కి, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ కి కృతజ్ఞతలు. ఏపీ గ్రీన్ సొసైటీ నిర్దేశించుకున్న లక్ష్యాలను సమర్థవంతంగా సాధించేందుకు పూర్తి చిత్తశుద్ధితో కృషి చేస్తాను. రాష్ట్రంలో పచ్చదనం పెంపు, అటవీ విస్తీర్ణం అభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ లక్ష్యాల సాధనకు ఏపీ గ్రీన్ ద్వారా కృషి చేస్తాను. పచ్చదనాన్ని 50 శాతానికి పెంచడమే లక్ష్యం ప్రస్తుతం రాష్ట్రంలో అటవీ విస్తీర్ణం 22.96 శాతంగా ఉంది. రాబోయే 2047 నాటికి రాష్ట్ర భౌగోళిక విస్తీర్ణంలో అటవీ, వృక్ష సంపదను కలిపి పచ్చదనాన్ని 50 శాతానికి



పెంచడమే మా ప్రధాన లక్ష్యం. ఇది కేవలం గణాంకాల కోసం పెట్టుకున్న లక్ష్యం కాదు. భావి తరాలకు స్వచ్ఛమైన గాలి, ఆరోగ్యకరమైన పర్యావరణం, మెరుగైన జీవన ప్రమాణాలు అందించాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. వాతావరణ మార్పులు ప్రపంచానికి సవాలుగా మారుతున్న ఈ సమయంలో పర్యావరణ పరిరక్షణ అనేది మనందరి బాధ్యత. అందుకే ఏపీ-గ్రీన్ కార్యక్రమాన్ని కేవలం అడవులకే పరిమితం చేయకుండా, రాష్ట్రంలోని ప్రతి అనుకూలమైన ప్రాంతంలో పచ్చదనాన్ని పెంచేలా కార్యాచరణ చేపడుతున్నాము. వ్యవసాయ భూములు, గ్రామాలు, పట్టణ ప్రాంతాలు, ప్రధాన రహదారుల ఇరువైపులా, కాలువ గట్లు, ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల ప్రాంగణాలు, పరిశ్రమల పరిసరాలు, అనుకూలమైన బంజరు భూములు ఎక్కడ అవకాశం ఉంటే అక్కడ పచ్చదనాన్ని పెంపొందించేందుకు కృషి చేస్తాం. పెద్ద ఎత్తున మొక్కల పెంపకం, తోటల అభివృద్ధిని ప్రోత్సహిస్తాం.

ఈ బృహత్తర లక్ష్యం విజయం కావాలంటే ఒక్క శాఖతో సాధ్యమయ్యేది కాదు. వ్యవసాయం, ఉద్యానవనం, పంచాయతీరాజ్, విద్య, పరిశ్రమలు, రెవెన్యూ, జలవనరులు, రవాణా, అటవీ శాఖలతోపాటు అన్ని సంబంధిత ప్రభుత్వ విభాగాలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతాం. ఏపీ గ్రీన్ కార్యక్రమాన్ని కేవలం ప్రభుత్వ కార్యక్రమంగా మాత్రమే ఉండకూడదు. రైతులు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ సామాజిక బాధ్యత సంస్థలు, విద్యార్థులు, యువత, పారిశ్రామికవేత్తలు, ప్రతి పౌరుడిని ఈ కార్యక్రమంలో భాగస్వాములను చేయాలనుకుంటున్నాం. ఏపీ-గ్రీన్‌ను ఒక ప్రభుత్వ పథకంగా కాకుండా, ప్రజలందరూ భాగస్వామ్యమయ్యే గొప్ప ప్రజా ఉద్యమంగా తీర్చిదిద్దడమే మా లక్ష్యం. మొక్కలు నాటడం మాత్రమే మా లక్ష్యం కాదు. నాటిన మొక్కలను బతికించడం, వాటిని సంరక్షించడం, అవి ఆరోగ్యంగా ఎదిగేలా చూడటమే అసలైన బాధ్యత. నాటిన ప్రతి మొక్క మనుగడపై ప్రత్యేక దృష్టి సారిస్తాం. వాటి సంరక్షణ, నిర్వహణ కోసం ప్రత్యేక నిఘా వ్యవస్థను ఏర్పాటు చేస్తాం" అన్నారు.

# సెప్టెంబర్ 2 నుంచి బీఆర్ఎస్ పోరుబాట

మొదటిపేజీ తరువాయి

నిరసనలు, 4న మహిళలకు ఇచ్చిన హామీల అమలు వైఫల్యంపై ఆందోళనా కార్యక్రమాలు, 5న ఫీజు రీయింబర్స్‌మెంట్, జాబ్ క్యాలెండర్, యూత్ డిక్లరేషన్‌పై పోరాటం, 6న హైదరాబాద్‌లో నగర సమస్యలపై ఆటోలతో భారీ ర్యాలీ, 7న, ప్రజావాణి కేంద్రాల్లో కాంగ్రెస్ హామీల వైఫల్యంపై వినతిపత్రాలు 8న వారం రోజుల పోరాట కార్యక్రమాలపై అన్ని జిల్లా కేంద్రాల్లో ప్రెస్‌మీట్లు, అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించాలని పార్టీ శ్రేణులను కోరారు. అలాగే సెప్టెంబర్ 10న ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘాల నిరసనలకు బీఆర్ఎస్ పార్టీ తరఫున సంఘీభావం తెలియజేయాలన్నారు. మొత్తం కార్యక్రమాలను పార్టీ కేంద్ర కార్యాలయం ఎప్పటికప్పుడు సమన్వయం చేస్తుందని కేటీఆర్ తెలిపారు. ప్రతి కార్యక్రమంపై నివేదికలు తీసుకోవడంతోపాటు పార్టీ కేడర్‌ను అప్రమత్తం చేసి నాయకులకు అవసరమైన మార్గదర్శకాలు అందజేస్తామని చెప్పారు. పార్టీ నిర్దేశించిన కార్యాచరణను ప్రతి ఒక్కరూ తమ తమ కార్యక్షేత్రాల్లో విజయవంతం చేసి, కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లో ఎండగట్టాలని విజ్ఞప్తి చేశారు.

# వివాదంవేళ..రక్షాబంధన్

మొదటిపేజీ తరువాయి



మంత్రి పాల్గొనకపోవడం చర్చనీయాంశమైంది. పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డిని మంత్రి కొండా సురేఖ తీవ్ర స్థాయిలో వ్యతిరేకిస్తున్నారు.

తమ వర్గీయులను అణగదొక్కే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపణలు చేశారు. మరోవైపు పరకాల బహిరంగ సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి వచ్చే ఎన్నికల్లో రేవూరి ప్రకాశ్‌రెడ్డిని భారీ ఆధిక్యతతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. వచ్చే ఎన్నికల్లో రేవూరే అభ్యర్థి అన్న సంకేతం ఇచ్చినట్లయ్యింది. ఇది జరిగిన మరుసటి రోజే కొండా సురేఖ కుమార్తె పరకాల నియోజకవర్గంలోని గీసుకొండలో సభ ఏర్పాటు చేసి ముఖ్యమంత్రిపైన, స్థానిక ఎమ్మెల్యేపైన తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేయడంతో పాటు వచ్చే ఎన్నికల్లో ఇక్కడి నుంచి పోటీ చేస్తానని చెప్పారు. సుస్మిత చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ అధిష్ఠానం కూడా సీరియస్‌గా తీసుకొన్నట్టు సమాచారం. నేరుగా ముఖ్యమంత్రిపై చేసిన విమర్శలు, ఆరోపణలు కాంగ్రెస్‌లో తీవ్ర స్థాయిలో చర్చనీయాంశంగా మారాయి. ఈ వ్యవహారంలో పీసీసీ క్రమశిక్షణా కమిటీ మంత్రి కొండా సురేఖకు నోటీసు ఇవ్వగా, కుమార్తె చేసిన ఆరోపణలకు తానెలా బాధ్యురాలిని అవుతానని సమాధానం ఇచ్చారు. క్రమశిక్షణా రాహిత్యంగా భావించి నోటీసులివ్వడంతోనే పరిమితం కాకుండా చర్యలకు కూడా ఉపక్రమించే అవకాశం ఉన్నట్లు పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఈ క్రమంలో సీఎం నివాసానికి కొండా సురేఖ వెళ్లడం చర్చనీయాంశంగా మారింది.

# మహిళల పేరిటే ఉచిత రిజిస్ట్రేషన్

**పదేండ్ల తర్వాత పూర్తి హక్కులు**

**హైదరాబాద్ క్యూర్ పరిధిలో పేదలకు ఆత్మగౌరవ ఇండ్లు**

**రాజకీయాలకతీతంగా లాటరీ విధానంలో 480 ఇందిరమ్మ**

**ఫ్లాట్ల కేటాయింపు :మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి**

**నాంపల్లిలో ఘనంగా ఇందిరమ్మ ఇండ్ల లాటరీ ప్రక్రియ**



**హైదరాబాద్ ఆగస్టు 28(ప్రజావినికిడి):**

రాష్ట్రంలో పేదల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమనీ, అర్హులైన ప్రతి పేద కుటుంబానికీ రాజకీయాలకతీతంగా ఇందిరమ్మ ఇండ్లను అందిస్తామని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు. సీఎం ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదలకు గౌరవప్రదమైన గృహ వసతి కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని తెలిపారు. శుక్రవారం హైదరాబాద్ నాంపల్లి వెట్స్ గార్డెన్‌లో 'హైదరాబాద్ కోర్ అర్బన్ రీజియన్' (క్యూర్) ప్రాజెక్ట్ కింద నాంపల్లి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని 480 ఎల్‌ఐజీ/ఎంఐజీ ఇందిరమ్మ ఫ్లాట్ల కేటాయింపునకు నిర్వహించిన లాటరీ ప్రక్రియలో స్థానిక ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, గృహనిర్మాణ సంస్థ ఎండీ గౌతమ్, జిల్లా కలెక్టర్ డాక్టర్ ప్రియాంక ఆలతో కలిసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ఫ్లాట్ల కేటాయింపునకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి, లబ్ధిదారుల సమక్షంలో పూర్తి పారదర్శకంగా లాటరీ నిర్వహించామని, దీనిని ప్రత్యక్ష ప్రసారమూ చేశామని తెలిపారు. 480 ఫ్లాట్లకు గాను మొత్తం 600 మంది పేర్లను లాటరీ ద్వారా డ్రా తీశామన్నారు. ఇందులో 480 మందిని కేటాయింపునకు పరిగణనలోకి తీసుకోగా, మరో 120 మందిని వెయిట్‌లిస్ట్‌లో ఉంచినట్టు వెల్లడించారు. ఎంపికైన వారి అర్హతలను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించిన అనంతరం తుది ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని, ఎవరైనా అనర్హులుగా తేలితే వెయిట్‌లిస్ట్‌లోని వారికి అవకాశం కల్పిస్తామని స్పష్టం చేశారు.

**రూ. 50 నుంచి 60 లక్షల ఆస్తి**

హైదరాబాద్ క్యూర్ పరిధిలో సొంత ఇల్లు కొనలేని నిరుపేదలకు వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే విలువైన భూముల్లో బహుళ అంతస్తుల భవనాలు (లిఫ్ట్ సౌకర్యంతో) నిర్మించి ఇస్తున్నామని మంత్రి పేర్కొన్నారు. ఒక్కో ఫ్లాట్ సుమారు 525 చదరపు అడుగుల విస్తీర్ణంతో పాటు, 17 నుంచి 20 చదరపు గజాల అన్‌డివైడెడ్ షేర్ ఆఫ్ ల్యాండ్ (యూడీఎస్) కలిగి ఉంటుందన్నారు. లబ్ధిదారులైన మహిళల పేరిటే ఎలాంటి ఫీజు లేకుండా ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తారని తెలిపారు. 10 ఏండ్ల అనంతరం లబ్ధిదారులు ఈ ఆస్తిని విక్రయించుకోవడానికి లేదా పిల్లల చదువులు, పెండ్లీల కోసం రుణాలు పొందేందుకు బ్యాంకుల్లో తాకట్టు పెట్టుకునే పూర్తి హక్కులు లభిస్తాయన్నారు. మార్కెట్‌లో సుమారు రూ. 50 నుంచి 60 లక్షల విలువైన ఆస్తి పేదలకు దక్కుతుందని మంత్రి తెలిపారు.

**20 నియోజకవర్గాల్లో పైలట్ ప్రాజెక్ట్**

హైదరాబాద్ క్యూర్ పరిధిలో నియోజకవర్గాల వారీగా లక్ష ఇండ్లను లక్ష్యంగా పెట్టుకున్నామని మంత్రి తెలిపారు. మొదటి దశలో పైలట్ ప్రాజెక్టుగా 20 నియోజకవర్గాలను ఎంపిక చేసి, ఒక్కో నియోజక వర్గంలో 480 ఇండ్లను నిర్మిస్తున్నామన్నారు. ఇప్పటికే 16 నియోజకవర్గాల్లో భూమిని గుర్తించి టెండర్లు ఖరారు చేశామని, మరో 4 నియోజకవర్గాల్లో ప్రక్రియ కొనసాగుతోందని వివరించారు.

**ప్రభుత్వంపై ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్ ప్రశంసలు**

నాంపల్లి ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రతిపాదన వచ్చిన కేవలం 3 నెలల్లోనే లబ్ధిదారుల ఎంపిక వరకు తీసుకువచ్చిన ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. నాంపల్లిలోని నిలోఫర్ ఆస్పత్రి సమీపంలో గజం రూ. 3 లక్షల విలువైన అత్యంత ఖరీదైన ప్రభుత్వ స్థలాన్ని వేలం




వేస్తే వందల కోట్ల ఆదాయం వచ్చేదని, కానీ ప్రభుత్వం ఆదాయాన్ని పక్కనపెట్టి పేదల సంక్షేమానికి కేటాయించడం గొప్ప నిర్ణయమని కొనియాడారు. హౌసింగ్ ఎండీ, కలెక్టర్ మాట్లాడుతూ.. నగరంలో భూముల కొరత ఉన్నప్పటికీ నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను గుర్తించి సమర్థవంతంగా వినియోగిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ చీఫ్ ఇంజినీర్ రమణారెడ్డి, పీడీ అశోక్ చక్రవర్తి, ఆర్డీవో రామకృష్ణ, తహసీల్దార్లు నయీముద్దీన్, జ్యోతి తదితర అధికారులు, పెద్ద సంఖ్యలో లబ్ధిదారులు పాల్గొన్నారు.





# సీఎం రేవంత్ రెడ్డి కి రాఖీ కట్టిన కాంగ్రెస్ నాయకురాలు మామిడి మాదేవి

**హిమాయత్ నగర్,(ప్రజావినికిడి):** రక్షాబంధన్ సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఏ. రేవంత్ రెడ్డి ని కార్వాన్ నియోజవర్గం కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు, సబ్జీమండి గంగపుత్ర మామిడి మాదేవి మర్యాదపూర్వకంగా కలిసి వెండి రాఖి కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు.

# తమ భూమిలో ఇచ్చిన అక్రమ విద్యుత్ కనెక్షన్‌ను వెంటనే తొలగించాలి..

## స్థానికుడు బాలగౌని బాలరాజ్ గౌడ్ డిమాండ్..

**ఘట్కేసర్,(ప్రజావినికిడి):**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్‌కేసర్ మండలం అన్నోజిగూడ పరిధిలోని సర్వే నంబర్ 93లో నిబంధనలకు విరుద్ధంగా ఇచ్చిన అక్రమ విద్యుత్ కనెక్షన్‌ను తక్షణమే తొలగించాలని స్థానికుడు బాలగౌని బాలరాజ్ గౌడ్ డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, అన్నోజిగూడ గ్రామ రెవెన్యూ సర్వే నెంబర్ 93 లో భూమికి సంబంధించి అసలు పట్టాదారు ఉస్కె నర్సింహారెడ్డి నుండి తాను చట్టబద్ధంగా జిపిఎ అలాగే సేల్ డీడ్ హక్కులు పొంది ఉన్నానని బాలగౌని బాలరాజ్ గౌడ్ పేర్కొన్నారు. పూర్తి చట్టబద్ధమైన హక్కులు, డాక్యుమెంట్లు తన వద్ద ఉన్నప్పటికీ, నిబంధనలకు తిలోదకాలిచ్చి బోయినపల్లి మల్లారెడ్డి కుటుంబ సభ్యులకు అధికారులు విద్యుత్ కనెక్షన్ ఎలా మంజూరు చేశారని ప్రశ్నించారు. ఇందుకు సంబందించి తప్పుడు సమాచారంతో, అక్రమ మార్గాల్లో పొందిన ఈ కనెక్షన్‌ను అధికారులు క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించాలని నారపల్లి విద్యుత్ శాఖ ఏఈ కి ఫిర్యాదు చేసామన్నారు. విద్యుత్ శాఖ అధికారులు సమగ్ర విచారణ చేపట్టి అక్రమ విద్యుత్ కనెక్షన్‌ను వెంటనే తొలగించి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలనీ, తనకు న్యాయం జరిగే వరకు చట్టపరంగా పోరాటం కొనసాగిస్తానని బాలగౌని బాలరాజ్ గౌడ్ స్పష్టం చేశారు.

# నేడు నారపల్లి విద్యుత్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాలో అంతరాయం

## నారపల్లి విద్యుత్ ఏఈ విక్రమ్ భూక్యా



**ఘట్కేసర్,(ప్రజావినికిడి):**
మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఘట్కేసర్ మండలం నారపల్లి సెక్షన్ పరిధిలో విద్యుత్ లైన్ల అభివృద్ధి, ఆధునీకరణ పనుల నేపథ్యంలో నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడనుందని నారపల్లి విద్యుత్ శాఖ ఏఈ విక్రమ్ భూక్యా ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా సింగపూర్ సబ్‌స్టేషన్ అన్నోజిగూడ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 12 గంటల నుంచి 12:30 గంటల వరకు సాయి సందీప్ కాలనీ , శ్రీకృష్ణ నగర్, అన్నోజిగూడ పాత గ్రామం, ఎస్ఎల్ఎన్ఎస్ కాలనీ,ఎల్ఐజీ కాలనీ, హనుమాన్ నగర్,ఇందిరా నగర్,సాయి నగర్ కాలనీ, సత్యసాయి హౌసింగ్ కాలనీ, సాయి గణేష్ కాలనీ,సాయి గణేష్ ఎన్‌క్లేవ్, సుముకేశ్ హైట్స్, ఐఫోసిటీ, ప్రేమలత గ్రాండియర్ తదితర ప్రాంతాల్లో సరఫరా నిలిచిపోనుందని అన్నారు. పోచారం సబ్‌స్టేషన్ పరిధిలో ఇన్ఫోసిస్ హాస్టల్ పరిసర కాలనీలు, సెరేనియా హిల్స్, పోచారం గ్రామంలోని శివాలయం పరిసర ప్రాంతం, పోచారం గ్రామం, అన్నానగర్, డాక్టర్స్ కాలనీ, విజయ్ సాయి ఎన్‌క్లేవ్,గెలాక్సీ టవర్స్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి 2:30 గంటల వరకు విద్యుత్ అంతరాయం ఉంటుందని వినియోగదారులు విద్యుత్ అంతరాయం సమయాన్ని గమనించి ముందస్తు ఏర్పాట్లు చేసుకోవాలని, వివరాలకు 8712471630, 8712471681 నంబర్లలో సంప్రదించాలని నారపల్లి విద్యుత్ శాఖ ఏఈ విక్రమ్ భూక్యా తెలిపారు.

# ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి రాఖీ కట్టిన మాజీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి



**హైదరాబాద్,(ప్రజావినికిడి):** రక్షాబంధన్ పర్వదినాన్ని పురస్కరించుకుని తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి ని గ్రేటర్ హైదరాబాద్ మాజీ డిప్యూటీ మేయర్ మోతే శ్రీలత శోభన్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి నివాసంలో రేవంత్ రెడ్డి కి శ్రీలత శోభన్ రెడ్డి రాఖీ కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం శ్రీలత శోభన్ రెడ్డి మాట్లాడుతూ, రక్షాబంధన్ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, నమ్మకం,రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. ఈ పవిత్రమైన రోజున ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కి రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలియజేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. తెలంగాణ ప్రజల సంక్షేమం,రాష్ట్ర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం చేస్తున్న కృషి అభినందనీయమని ఆమె పేర్కొన్నారు. ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా తెలంగాణను మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లాలని ఆకాంక్షించారు. రక్షాబంధన్ సందర్భంగా ప్రజలందరికీ ఆమె శుభాకాంక్షలు తెలియజేస్తూ, కుటుంబాల్లో ప్రేమానురాగాలు, సోదరభావం, పరస్పర గౌరవం మరింత బలపడాలని ఆకాంక్షించారు.

# ఘనంగా వికలాంగుల హక్కుల పోరాట సమితి 19వ వార్షికోత్సవం..





**రంగారెడ్డి,ఆగస్టు 28,(ప్రజావినికిడి):**
వికలాంగుల హక్కుల పోరాట సమితి 19వ వార్షికోత్సవం హయత్ నగర్ లో వికలాంగుల హక్కుల పోరాట స జాతీయ కోర్ కమిటీ వైస్ చైర్మన్ అందే రాంబాబు జెండా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ, వికలాంగుల హక్కుల పోరాట సమితి ఏర్పాటు చేసి నేటి 19 సంవత్సరాలు గడుస్తుందని 2007 లో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ నాయకత్వంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్లో కేవలం 200 రూపాయల నటువంటి వికలాంగుల పెన్షన్ 1500 రూపాయలు చేయాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం డిమాండ్ చేసి నేడు రెండు తెలుగు రాష్ట్రాలలో తెలంగాణలో 4016రూపాయల పెన్షన్ వృద్ధుల వితంతువులకు 2016రూపాయలు పెన్షన్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వికలాంగులకు 6000 రూపాయలు పెన్షన్ వృద్ధులు వితంతువులకు 4000 పెన్షన్ పూర్తి వైకల్యం కలిగిన వారికి 1500 పెన్షన్ వస్తున్నది అంటే అది మందకృష్ణ మాదిగ ఉద్యమ ఫలితం అని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో 2023లో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వికలాంగులకు 6000 రూపాయలు పెన్షన్ వృద్ధుల వితంతువులకు 4000 పెన్షన్ ఇస్తానని చెప్పి గత మూడు సంవత్సరాలుగా మోసం చేసింది అని ఈ మోసాన్ని ఎండగడుతూ భవిష్యత్తులో మందకృష్ణ మాదిగ నాయకత్వంలో పూర్తి వైకల్యం కలిగిన వారికి 15,000 పంపించాను ఇచ్చేంతవరకు వీహెచ్పీఎస్ రాష్ట్ర ప్రభుత్వం మీద యుద్ధం ప్రకటిస్తుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో వీహెచ్పీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోవర్ధన్, ఎమ్మార్పీఎస్ ఎల్బీనగర్ నియోజకవర్గం ఇంచార్జ్ కొమ్ము రాజశేఖర్ మాదిగ, ఎల్బీనగర్ నియోజకవర్గ ఏం ఎస్ పి ఇన్చార్జ్ ఎర్ర రవి మాదిగ,భరత్ మాదిగ , చిత్తలూరి వేణు, సతీష్ మాదిగ, కొమరయ్య నాయక్,పాండు యాదవ్, సైదులు యాదవ్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# పోలీస్ అన్నకు రాఖీ కట్టిన చిన్నారి అక్షిత

**రక్షణకు ప్రతీకగా రాఖీ.. ఆత్మీయతతో పోలీస్‌స్టేషన్‌కు చేరిన చిన్నారి**

**ఇన్‌స్పెక్టర్ శంకరయ్య కు రాఖీ కట్టి స్వీట్ తినిపించిన అక్షిత**

**సోదరభావం, ప్రేమానురాగాలకురాఖీ పౌర్ణమి ప్రతీక.. ఇన్‌స్పెక్టర్ శంకరయ్య..**




**హయత్ నగర్,(ప్రజావినికిడి):**
రాఖీ పౌర్ణమి పర్వదినం సందర్భంగా ఓ చిన్నారి పోలీస్ అధికారులను సోదరులుగా భావించి రాఖీ కట్టి ఆత్మీయతను చాటుకుంది. హయత్‌నగర్‌లో నివసిస్తూ ఏడో తరగతి చదువుతున్న దార్ల అక్షిత తన సోదరుడు హర్షవర్ధన్‌తో కలిసి శుక్రవారం హయత్‌నగర్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లింది. అక్కడ ఇన్‌స్పెక్టర్ సీహెచ్. శంకరయ్యను కలిసి ఆయనకు రాఖీ కట్టి, స్వీట్ తినిపించింది. అనంతరం ఆయన ఆశీర్వాదం తీసుకుంది.

**పోలీసులపై చిన్నారి ఆప్యాయత**

రాఖీ కట్టేందుకు పోలీస్‌స్టేషన్‌కు వచ్చిన చిన్నారి అక్షితను ఇన్‌స్పెక్టర్ శంకరయ్య ఆప్యాయంగా పలకరించారు. రాఖీ కట్టిన అనంతరం చిన్నారిని ఆశీర్వదించి అభినందించారు. అనంతరం పోలీస్‌స్టేషన్ అడ్మిన్ ఎస్ఐ నరసింహకు కూడా అక్షిత రాఖీ కట్టి స్వీట్ తినిపించింది. చిన్నారి చూపిన ఆత్మీయతతో పోలీస్ అధికారులు, సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు.

**సోదరభావానికి ప్రతీక రాఖీ పౌర్ణమి**

రాఖీ పౌర్ణమి సోదరసోదరీమణుల మధ్య ప్రేమ,అనురాగం, నమ్మకం,రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని ఇన్‌స్పెక్టర్ శంకరయ్య అన్నారు. రాఖీ కేవలం ఒక దారం కాదని.. ఆప్యాయత, బాధ్యత, రక్షణకు ప్రతీక అని పేర్కొన్నారు. కుటుంబ సభ్యులతో పాటు సమాజంలోని ప్రతి ఒక్కరి పట్ల ప్రేమాభిమానాలు,మానవతా దృక్పథంతో మెలగడమే పండుగల అసలు ఉద్దేశమన్నారు. చిన్నారులు మన సంస్కృతి, సంప్రదాయాలను తెలుసుకుని పండుగలను ఆనందంగా జరుపుకోవడం అభినందనీయమని అన్నారు. అక్షిత వంటి చిన్నారుల్లో ఉన్న ఆప్యాయత, పెద్దల పట్ల గౌరవం ఇతరులకు స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా అక్షిత, హర్షవర్ధన్‌లకు ఇన్‌స్పెక్టర్ శంకరయ్య రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు.

**పోలీస్‌స్టేషన్‌లో పండుగ సందడి**

రాఖీ పండుగ సందర్భంగా చిన్నారి అక్షిత పోలీస్‌స్టేషన్‌కు వచ్చి అధికారులకు రాఖీ కట్టడంతో అక్కడ ఆత్మీయ వాతావరణం నెలకొంది. సోదరభావాన్ని చాటే రాఖీ పౌర్ణమి వేడుకలను చిన్నారులు ఆనందంగా జరుపుకోవడం పలువురిని ఆకట్టుకుంది

# పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలు తప్పనిసరి

**నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానంపై ఆరా తీయాలి**

**నేర నియంత్రణలో సాంకేతికితకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలి**

**తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశం**




**హైదరాబాద్,ఆగస్టు 28(ప్రజావినికిడి):**
నేరాల దర్యాప్తు, పోలీసింగ్‌లో వృత్తి నైపుణ్య ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సంబంధిత అధికారులను తెలంగాణ డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. నేరాల సమీక్షను కేవలం గణాంకాలకే పరిమితం చేయకుండా.. ప్రతి నేరం వెనుక కారణాలు, నేరస్థుల విధానం, దర్యాప్తు తీరు, ఆయా కేసుల పరిష్కారాన్ని సమగ్రంగా విశ్లేషించాలని సూచించారు. అన్ని యూనిట్ల పోలీసు ఉన్నతాధికారులతో శుక్రవారం డీజీపీ కార్యాలయంలో అర్ధవార్షిక నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. అన్ని యూనిట్ల పోలీసు అధికారులకు పలు కీలక అంశాలపై డీజీపీ దిశా నిర్దేశం చేశారు. సాంకేతికతను నేర నియంత్రణకు సాధనంగా వినియోగించాలని డీజీపీ సూచించారు. సైబర్, ఆర్థిక నేరాలు తగ్గాయని అన్నారు. మాదకద్రవ్యాలు, వ్యవస్థీకృత నేరాలపై ప్రత్యేక దృష్టిసారించామని వెల్లడించారు. ఆయా యూనిట్ల వారీగా నెలవారీ సమీక్షలు తప్పనిసరని స్పష్టం చేశారు. బేసిక్ పోలీసింగ్ విధానాన్ని అమలు చేయాలని సూచించారు. వృత్తిపరమైన ప్రమాణాలు పాటించాలని మార్గనిర్దేశర చేశారు. ఇటీవల సీసీటీఎన్ఎస్‌పై ప్రత్యేకంగా దృష్టి సారించడంతో గతంలో 70 నుంచి 80 శాతంగా ఉన్న.. సీసీటీఎన్ఎస్ డేటా అప్‌డేట్.. అధికారులు, సిబ్బంది సమష్టి కృషితో 96 శాతానికి చేరడం అభినందనీయమని డీజీపీ పేర్కొన్నారు. ప్రతి నెల నిర్వహించే క్రైమ్ రివ్యూ సమావేశాలకు మరింత ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. క్షేత్రస్థాయిలో పోలీసులు పాటించాల్సిన ప్రాథమిక విధానాలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ప్రొఫెషనల్ స్టాండర్డ్స్‌ను పాటించడాన్ని అధికారులు పోటీగా తీసుకోవాలని సూచించారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని డీజీపీ సీవీ ఆనంద్ ఆదేశించారు. ఆయా జిల్లాల పర్యటనలు, పోలీస్‌స్టేషన్ల తనిఖీల సమయంలో గుర్తించే అంశాలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని నిర్దేశిరచారు. నేరాల ధోరణిని ముందుగానే గుర్తించి, అవసరమైన చోట ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని సూచించారు. డీజీపీ సీవీ ఆనంద్ అధ్యక్షతన జరిగిన సమీక్షా సమావేశానికి డీజీ (లా అండ్ ఆర్డర్) మహేశ్ భగవత్, సీఐడీ డైరెక్టర్ శిఖా గోయెల్, ఉమెన్ సేఫ్టీ, సీఐడీ డైరెక్టర్ చారు సిన్హా, ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్యా హాజరయ్యారు. అలాగే, రాష్ట్రంలోని అన్ని పోలీసు కమిషనర్లు, జిల్లా ఎస్పీలు, ఇతర ఉన్నతాధికారులు, పోలీసు సిబ్బంది ఈ సమావేశంలో పాల్గొన్నారు. అన్ని జోన్ల డీఐజీలు, మల్టీజోన్ ఐజీలు ఇకపై ఇన్‌స్పెక్షన్ నోట్స్‌ను పరిశీలించాలని ఆదేశించారు. రాష్ట్రంలో 7.15శాతం నేరాలు పెరిగాయని డీజీపీ వెల్లడించారు. మాదకద్రవ్యాల కేసుల్లో 46.10శాతం వృద్ధి సాధించిందని అన్నారు. సైబర్, ఆర్థిక నేరాల్లో తగ్గాయని చెప్పుకొచ్చారు. రాష్ట్రంలో మొత్తం నేరాల సంఖ్య మూడేళ్లలో 7.15 శాతం పెరిగాయని వివరించారు. 2023-24లో 2,65,377 కేసులు నమోదుకాగా.. 2025-26లో 2,84,363కు చేరాయని చెప్పారు. లక్ష జనాభాకు నేరాల రేటు 481.58 నుంచి 491.59కి పెరిగిందని తెలిపారు. మాదకద్రవ్యాల కేసులు 2023-24లో 2,026 ఉండగా.. 2025-26లో 2,960కు చేరాయని ప్రస్తావించారు. మూడేళ్లలో 46.10 శాతం పెరిగాయని వెల్లడించారు. వ్యవస్థీకృత నేరాలు 25 నుంచి 451కు పెరిగి 1,704 శాతం వృద్ధిని నమోదు చేశాయని అన్నారు. ట్రాఫిక్ నేరాలు 29,130 నుంచి 31,891కు పెరిగి 9.48 శాతం వృద్ధి చెందాయన్నారు. మరోవైపు సైబర్ నేరాలు 25,373 నుంచి 22,000కు తగ్గి 13.29 శాతం, ఆర్థిక నేరాలు 37,690 నుంచి 32,684కు తగ్గి 13.28 శాతం క్షీణించాయని చెప్పారు. తీవ్ర నేరాల్లో 10.33శాతం తగ్గాయని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు.

# నాగోల్ పోలీస్ స్టేషన్‌లో ఘనంగా రాఖీ పండుగ వేడుకలు












**నాగోల్, (ప్రజావినికిడి):** రక్షాబంధన్ రాఖీ పండుగ సందర్భంగా నాగోల్ పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం పోలీసు సిబ్బందితో కలిసి రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు.
ఈ సందర్భంగా మహిళా పోలీసు సిబ్బంది పోలీసు అధికారులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐలు పి. శివ నాగ ప్రసాద్, నర్సింహ, ఉమా, మమతతో పాటు మహిళా పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.
ఈ సందర్భంగా నాగోల్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ మక్బూల్ జానీ మహిళా పోలీసు సిబ్బందిని అభినందించి, వారికి కానుకలు అందజేసి గౌరవించారు.
రాఖీ పండుగ సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవానికి ప్రతీకగా నిలుస్తుందని ఈ సందర్భంగా సిబ్బంది పేర్కొన్నారు.





రాఖీ పండుగ సోదర సోదరీమణుల మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర గౌరవానికి ప్రతీక - ఆగస్టు 28,(ప్రజావినికిడి):

# అన్నయ్యలకు రాఖీకట్టిన చెల్లెమ్మ

## అన్నా చెల్లెల్ల అనుబంధం

### జన్మ జన్మల ప్రేమానుబంధం నిస్వార్థ ఆప్యాయత రక్షా బంధం






**షాద్ నగర్,(ప్రజావినికిడి):**
రక్షాబంధన్ పండుగను పురస్కరించుకుని చెల్లెమ్మ తన అన్నయ్యలకు ఎంతో ప్రేమ అభిమానంతో అన్నయ్యల చేతికి రాఖీ కట్టి, వారి ఆశీస్సులు తీసుకుంది. అన్నా చెల్లెల్ల మధ్య ఉన్న ఆప్యాయత, ప్రేమ అనురాగానికి రక్షాబంధన్ పండుగ ప్రతీకగా నిలుస్తుందని అన్నయ్య వదినమ్మలు తెలిపారు. రక్షా బంధన్ అంటే చేతికి కట్టే రాఖీ మాత్రమే కాదు జీవితాంతం తోడు నిలిచే అన్న చెల్లె అనుబంధ ఒక అందమైన గుర్తు చిన్నపట్టి నుంచి అన్నయ్యలపై తనకున్న ప్రేమను రాఖీ రూపంలో వ్యక్తం చేసిన చెల్లెమ్మ రాఖీ కట్టిన అనంతరం అన్నయ్యలు తమ చెల్లెమ్మకు, ప్రేమగా ఆశీర్వదించారు. రక్ష బంధం వేడుకలు సంతోషంగా అన్నయ్యలు చెల్లెలు మధ్య ప్రేమానుబంధాన్నిమరింత బలపరిచేలా ఈ వేడుక నిలిచింది.

# రాఖీ కోసం..
# రహదారులపై పరుగులు!

**అన్నదమ్ముల చేతికి రాఖీ కట్టేందుకు**
**పుట్టింటి బాట పట్టిన ఆడబిడ్డలు**
**కిక్కిరిసిన బస్సులు..**
**నిండిపోయిన ఆటోలు..**
**రైల్వే స్టేషన్లలోనూ రద్దీ**
**ఏడాదికి ఒక్కసారి వచ్చే పండుగ కోసం దూర ప్రాంతాల నుంచి తరలివచ్చిన అక్కాచెల్లెళ్లు**



**, ఆగస్టు 28(ప్రజావినికిడి):**
రాఖీ పండుగ అంటేనే బంధాల పండుగ.. ఆత్మీయతల పండుగ అన్నాచెల్లెళ్ల అనుబంధానికి ప్రతీక ఏడాదికి ఒక్కసారి వచ్చే ఈ పర్వదినం కోసం ఉమ్మడి వరంగల్ జిల్లా పల్లెలు, పట్టణాలు పండుగ శోభను సంతరించుకున్నాయి. వివాహమై మెట్టినింటికి వెళ్లిన ఆడబిడ్డలు.. చదువులు, ఉద్యోగాల కోసం దూర ప్రాంతాల్లో స్థిరపడిన అక్కాచెల్లెళ్లు ఎంత దూరమైనా లెక్కచేయకుండా పుట్టింటి బాట పట్టారు. ఒక్క లక్ష్యం.. తమ అన్నదమ్ముల చేతికి రాఖీ కట్టాలి.. వారి క్షేమాన్ని కోరాలి.. ఆత్మీయతను పంచుకోవాలి.
రాఖీ పౌర్ణమి సందర్భంగా శుక్రవారం ఉదయం నుంచే ఉమ్మడి వరంగల్ జిల్లాలో పండుగ సందడి నెలకొంది. ప్రధాన పట్టణాలు, మండల కేంద్రాలు, గ్రామాల్లో రాఖీల కొనుగోళ్లతో దుకాణాలు కళకళలాడాయి. బస్టాండ్లు, రహదారులు, ఆటో స్టాండ్లు ప్రయాణికులతో కిటకిటలాడాయి. అన్న కోసం అక్క.. చెల్లి కోసం అన్న తోబుట్టువుల కోసం తోబుట్టువులు.. ఇలా ఒకరినొకరు కలుసుకునేందుకు ప్రయాణాలు సాగించారు.

**రాఖీ కోసం పుట్టింటి బాట**
పెళ్లయిన తర్వాత పుట్టింటికి రావడం అరుదుగా మారిన ఆడబిడ్డలకు రాఖీ పండుగ ప్రత్యేక అవకాశంగా మారింది. దీంతో కొందరు ముందుగానే ప్రయాణాలు ప్రారంభించగా మరికొందరు పండుగ రోజే తెల్లవారుజామున బయలుదేరారు. వరంగల్, హనుమకొండ, కాజీపేటతో పాటు హైదరాబాద్, కరీంనగర్, ఖమ్మం, మహబూబాబాద్, జనగామ తదితర ప్రాంతాల నుంచి సొంతూళ్లకు తరలివచ్చారు.
చేతిలో రాఖీ సంచిలో స్వీట్లు.. అన్నదమ్ముల కోసం చిన్న కానుకలు పట్టుకుని బస్సులు, ఆటోలు, ఇతర వాహనాల్లో ప్రయాణిస్తూ కనిపించారు. కొందరు కుటుంబ సభ్యులతో కలిసి రాగా.. మరికొందరు ఒంటరిగానే పుట్టింటికి చేరుకున్నారు. ఇంటి గడప తొక్కగానే చిన్ననాటి జ్ఞాపకాలు గుర్తుచేసుకుంటూ అన్నాచెల్లెళ్ల మధ్య ఆప్యాయత వెల్లివిరిసింది.

**బస్సులు.. ఆటోలు కిక్కిరిసి**
రాఖీ పండుగ ప్రభావం రవాణాపైనా స్పష్టంగా కనిపించింది. బస్టాండ్లలో ప్రయాణికుల రద్దీ ఒక్కసారిగా పెరిగింది. అందుబాటులో ఉన్న బస్సులు ఆటోలు ప్రయాణికులతో కిక్కిరిశాయి. కొన్ని మార్గాల్లో సీట్ల కోసం ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. రద్దీ ఉన్న ప్రాంతాల్లో బస్సులు ఎక్కేందుకు ప్రయాణికులు బారులు తీరారు.
రాఖీ పండుగ సందర్భంగా ప్రయాణికుల రద్దీతో ప్రధాన రహదారులు సందడిగా మారాయి. పల్లెల నుంచి పట్టణాలకుపట్టణాల నుంచి పల్లెలకు పెద్ద సంఖ్యలో ప్రజలు రాకపోకలు సాగించారు.

**రాఖీ కట్టగానే ఆనందం రెట్టింపు**
ఇంటికి చేరుకున్న అక్కాచెల్లెళ్లు ముందుగా అన్నదమ్ములకు రాఖీ కట్టారు. నుదుటన తిలకం దిద్ది.. హారతి ఇచ్చిరాఖీ కట్టిన అనంతరం స్వీట్లు తినిపించారు. సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు కానుకలు అందించి జీవితాంతం అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.

**రాఖీ దారం చిన్నదే బంధం మాత్రం జీవితాంతం**
చిన్ననాటి నుంచి కలిసి పెరిగిన అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న అనుబంధాన్ని ఒక్క రాఖీ పండుగ మళ్లీ గుర్తుచేసింది. ఉద్యోగాలువివాహాలు.. కుటుంబ బాధ్యతలతో ఎక్కడెక్కడో ఉన్న తోబుట్టువులను ఒకే చోట చేర్చింది. కొద్దిసేపు కలిసినా ఆ క్షణాలను జీవితాంతం గుర్తుండిపోయేలా చేసుకున్నారు.

**కానుకల కంటే కలుసుకోవడమే ముఖ్యం**
రాఖీ పండుగ సందర్భంగా ఖరీదైన కానుకల కంటే అన్నదమ్ములను కలుసుకోవడమే తమకు ముఖ్యమని పలువురు అక్కాచెల్లెళ్లు తెలిపారు. ఏడాదిలో ఎన్నో సందర్భాలు వచ్చినా అందరం ఒకచోట చేరి మాట్లాడుకునే అవకాశం రాఖీ పండుగతోనే వస్తుందని పేర్కొన్నారు.
అన్నకు రాఖీ కట్టి క్షేమంగా ఉండాలని కోరుకోవడమే తమ ఆనందమని.. ఎంత దూరంలో ఉన్నా రాఖీ రోజు మాత్రం అన్న దగ్గరకు రావాలనిపిస్తుందని పలువురు ఆడబిడ్డలు ఆనందం వ్యక్తం చేశారు.



**పల్లెల్లో పండుగ సందడి**
ఉమ్మడి వరంగల్ జిల్లాలోని గ్రామాల్లో రాఖీ పండుగ ప్రత్యేక సందడిని తీసుకొచ్చింది. ఉదయం నుంచే ఇళ్ల వద్ద రాఖీ వేడుకలు ప్రారంభమయ్యాయి. చిన్నారులు యువతులు.. మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. అన్నదమ్ములకు రాఖీలు కట్టి స్వీట్లు తినిపించారు. సోదరులు కూడా తమ అక్కాచెల్లెళ్లకు కానుకలు అందించారు.
రాఖీ పండుగతో గ్రామాల్లో మళ్లీ పాత అనుబంధాలు మేల్కొన్నాయి. చిన్ననాటి జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ తోబుట్టువులు ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు.

**బంధాలను కలిపిన రాఖీ**
మొత్తంగా ఉమ్మడి వరంగల్ జిల్లాలో రక్షాబంధన్ పర్వదినం ప్రేమానురాగాలకు ప్రతీకగా నిలిచింది. రాఖీ కట్టేందుకు దూర ప్రాంతాల నుంచి వచ్చిన అక్కాచెల్లెళు వారిని ఆప్యాయంగా ఆహ్వానించిన అన్నదమ్ములు.. పండుగ కోసం కిక్కిరిసిన బస్సులు.. ఆటోలు.. సందడిగా మారిన పల్లెలు.. ఇలా జిల్లా అంతటా రాఖీ పండుగ ప్రత్యేక వాతావరణాన్ని సృష్టించింది.
రక్త సంబంధానికి రాఖీ బంధం తోడైంది. దూరాలను దాటిన అనుబంధం.. ఒక్కరోజు కోసం పుట్టింటికి పరుగులు అన్నాచెల్లెళ్ల ఆత్మీయతకు రాఖీ పండుగ చిరునామాగా మారింది.

# చౌలపల్లి జంగారెడ్డి నూతన గృహ ప్రవేశానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్



**షాద్ నగర్,(ప్రజావినికిడి):** ఫరూక్‌నగర్ మండలం దూసకల్ గ్రామానికి చెందిన చౌలపల్లి జంగారెడ్డి నూతనంగా గృహప్రవేశ కార్యక్రమం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై నూతన గృహాన్ని సందర్శించారు.
ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ నూతన గృహంలో ప్రత్యేక పూజా పాల్గొని, చౌలపల్లి జంగారెడ్డి కుటుంబ సభ్యులను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఇంట్లో కుటుంబ సభ్యులు ఎల్లప్పుడూ సుఖసంతోషా ఐశ్వర్యంతో వర్ధిల్లాలని ఆయన కోరారు. గృహప్రవేశ కార్యక్రమానికి బంధువులు, స్నేహితులు, స్థానిక నాయకులు, గ్రామ పెద్దలు పెద్ద సంఖ్యలో హాజరై చౌలపల్లి జంగారెడ్డి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఈట గణేష్, మాజీ జెట్ పీ వైస్ చైర్మన్, సీనియర్ నాయకులు కృష్ణారెడ్డి, భాగం కుమార్ యాదవ్, కావలి అశోక్ యాదవ్, చౌలపల్లి ఇంద్రసేన రెడ్డి, తదితరులు పాల్గొని నూతన చౌలపల్లి జంగారెడ్డికి, వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలిపారు.

# గవర్నర్‌ను పరామర్శించిన భట్టి

## ఆరోగ్యంపై ఆరా తీసిన సిఎస్ సంజయ్ జాజు

**హైదరాబాద్,(ప్రజావినికిడి):** తెలంగాణ గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను లోక్ భవన్‌లో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పరామర్శించారు. గుండె సంబంధిత సమస్యతో అనారోగ్యానికి గురై ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం డిశ్చార్జ్ అయ్యి లోక్ భవన్‌కు చేరుకున్న గవర్నర్ ని శుక్రవారం సాయంత్రం ఉప ముఖ్యమంత్రి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా గవర్నర్ ఆరోగ్య పరిస్థితి గురించి అడిగి తెలుసుకుని, త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో కోలుకోవాలని డిప్యూటీ సీఎం ఆకాంక్షించారు. అలాగే ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు కూడా గవర్నర్‌ను వేరుగా పరామర్శించారు. ఆయన ఆరోగ్యంపై ఆరా తీసారు.



# బాలిక ఆరోగ్యంపై మంత్రి ఆరా

## ఖమ్మం బాలికను పరామర్శించిన మంత్రి పొంగులేటి

**హైదరాబాద్,(ప్రజావినికిడి):** ఖమ్మం జిల్లాలో దారుణ ఘటనకు గురై నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాలికను రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి శుక్రవారం పరామర్శించారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని వైద్యులను అడిగి తెలుసుకున్న మంత్రి, అందుతున్న చికిత్సపై ఆరా తీశారు. బాలికకు మెరుగైన వైద్యం అందించి, త్వరగా కోలుకునేలా అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను కోరారు. బాలిక కుటుంబ సభ్యులను పరామర్శించిన మంత్రి వారికి ధైర్యం చెప్పారు. బాలికకు న్యాయం జరిగేలా ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని, నిందితులపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. బాలిక ఆరోగ్య పరిస్థితిని ప్రభుత్వం ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తుందని మంత్రి పొంగులేటి తెలిపారు.



# బంగారం మైనింగ్ లో హట్టి- సింగరేణి జతకట్టాలి

## భవిష్యత్తు ప్రాజెక్టుల్లో కలిసి పనిచేయాలి -సింగరేణి అధికారులకు భట్టి విక్రమార్క దిశా నిర్దేశం - హట్టి, యుటీ బంగారు గనులలో భట్టి విస్తృత పర్యటన

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
బంగారం మైనింగ్‌లో విశేష అనుభవమున్న కర్ణాటక ప్రభుత్వ సంస్థ హట్టి గోల్డ్ మైన్స్‌తో సింగరేణి కలిసి పనిచేసేలా జాయింట్ వెంచర్ అవకాశాలను పరిశీలించాలని తెలంగాణ ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క మల్లు అధికారులను ఆదేశించారు. రెండు ప్రభుత్వ రంగ సంస్థల సాంకేతిక సామర్థ్యం, అనుభవాన్ని సమన్వయం చేస్తే దేశీయ బంగారం ఉత్పత్తిలో మెరుగైన ఫలితాలు సాధించవచ్చని పేర్కొన్నారు. కర్ణాటక గోల్డ్ మైన్స్ ప్రాంతంలో రెండో రోజు పర్యటనలో భాగంగా శుక్రవారం రాయచూర్ జిల్లాలోని హట్టి, యూటి బంగారు గనులను ఉప ముఖ్యమంత్రి సందర్శించారు. బంగారు ఖనిజం తవ్వకం నుంచి శుద్ధ బంగారం తయారీ వరకు చేపడుతున్న ప్రక్రియలను క్షుణ్ణంగా పరిశీలించారు. హట్టి గోల్డ్ మైన్స్‌కు బంగారం అన్వేషణ, తవ్వకం, ప్రాసెసింగ్, శుద్ధిలో అపార అనుభవం ఉందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. బొగ్గు, ఇతర ఖనిజాల అన్వేషణ, తవ్వకాల్లో సింగరేణికి ఉన్న సాంకేతిక




నైపుణ్యాన్ని హట్టి అనుభవంతో జోడించాలని సూచించారు. బంగారం అన్వేషణ, తవ్వకం, వెలికితీత, శుద్ధి, ఆధునిక సాంకేతికత వినియోగం, నిపుణుల సేవలు, మానవ వనరుల శిక్షణ తదితర అంశాల్లో రెండు సంస్థలు సంయుక్తంగా పనిచేసేందుకు కార్యాచరణ రూపొందించాలని సింగరేణి అధికారులను ఆదేశించారు. దేశ ఆర్థిక భద్రతలో బంగారం కీలక పాత్ర పోషిస్తుందని భట్టి విక్రమార్క పేర్కొన్నారు. దేశంలో అందుబాటులో ఉన్న బంగారు ఖనిజ వనరులను శాస్త్రీయంగా అన్వేషించి వెలికితీయడంలో సింగరేణి వంటి ప్రభుత్వ రంగ సంస్థలు ముందుండాలన్నారు. బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించి దేశీయ ఉత్పత్తిని పెంచాల్సిన అవసరం ఉందన్నారు. హట్టి-సింగరేణి భాగస్వామ్యంతో బంగారం ఉత్పత్తి పెంపు, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, స్థానిక ఉపాధి కల్పనతోపాటు దేశ ఆర్థికాభివృద్ధికి మేలు జరుగుతుందని తెలిపారు. హట్టి గోల్డ్ మైన్స్‌లోని ప్రొడక్షన్ యూనిట్, ఖనిజ శుద్ధి కేంద్రం, ఎలక్ట్రో విన్నింగ్ కేంద్రాలను ఉప ముఖ్యమంత్రి పరిశీలించారు. గని నుంచి వెలికితీసిన ఖనిజాన్ని వివిధ దశల్లో ప్రాసెస్ చేసి శుద్ధ బంగారంగా మార్చే విధానాన్ని అధికారులు వివరించారు. హట్టి ప్రాజెక్టు ద్వారా రోజుకు సగటున రెండు నుంచి నాలుగు కిలోల బంగారం ఉత్పత్తి అవుతోందని అధికారులు తెలిపారు. యూటి ఓపెన్ కాస్ట్ గోల్డ్ మైన్' వ్యూ పాయింట్ వద్ద నిలబడి బంగారం ముడి మట్టిని వెలికి తీసిన ప్రక్రియను, సేకరించిన ప్రదేశాలను ఆయన ప్రత్యక్షంగా తిలకించారు. ఈ సందర్భంగా ఓపెన్ కాస్ట్ గనిలో ఎంత లోతు నుంచి బంగారం తయారీకి కావలసిన ముడి సరుకును తీశారనే వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం బంగారం ఖనిజ గనికి సంబంధించిన సమగ్ర మ్యాప్‌లను లోతుగా పరిశీలించారు. బంగారు ఖనిజ అన్వేషణకు ఏ సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తారని అధికారులను అడిగారు. అక్కడి అధికారులు డిప్యూటీ సీఎంతో మొక్కను నాటించారు. అనంతరం యుటీ భూ గర్భ గనిలో జరుగుతున్న బంగారు ఖనిజ తవ్వకాలను పరిశీలించారు. భూగర్భ గనిలో ఖనిజం తవ్వకం, రవాణా, యంత్రాల వినియోగం, కార్మికుల భద్రత తదితర అంశాలను ఉప ముఖ్యమంత్రి అడిగి తెలుసుకున్నారు. ఈ పర్యటనలో సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధ ప్రకాష్ జ్యోతి, ప్లానింగ్ అండ్ ప్రాజెక్ట్స్ డైరెక్టర్ వెంకటేశ్వర్లు, జనరల్ మేనేజర్ పంకజ్ కులశ్రేష్ఠ, రాయచూరు జిల్లా పరిషత్ సభ్యులు అమ్జద్, హట్టి గోల్డ్ మైన్స్ ఉన్నతాధికారులు అరుణవ ఘోష్, సఫీయుల్లా ఖాన్, విధాత్రి ఉపుండ, యెమ్మూరప్ప గౌడ, రిటైర్డ్ కల్నల్ దస్తగిరిసాహెబ్ దఫేదార్ పాల్గొన్నారు.

## చెస్ మాస్టర్ ప్రజ్ఞానందకు సిఎం రేవంత్ అభినందనలు

**హైదరాబాద్,(ప్రజావినికిడి):**
అమెరికాలోని సెయింట్ లూయిస్‌లో జరిగిన గ్రాండ్ చెస్ టూర్ టైటిల్‌ను సొంతం చేసుకుని, చరిత్ర సృష్టించిన భారత చెస్ గ్రాండ్ మాస్టర్ ఆర్. ప్రజ్ఞానందకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అభినందనలు తెలిపారు. అంతర్జాతీయ వేదికలపై భారత ఖ్యాతిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిన ప్రజ్ఞానంద విజయం ప్రతి పౌరుడు గర్వించదగ్గ విషయమని కొనియాడారు. ప్రజ్ఞానంద విజయం క్రీడాకారులకు, యువతీయువకులకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు. భవిష్యత్తులో ప్రజ్ఞానంద మరెన్నో అద్భుతమైన విజయాలు సాధించి, దేశానికి కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

## పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లు అయ్యింది

**కాంగ్రెస్‌ను నమ్మి ఓటేసినందుకు ప్రజల్లో బాధ**

**రేషన్ కార్డులపై మోడీ ఫోటో ఎందుకు వేయరు**

**సిఎస్ సంజయ్ జాజుతో పలు అంశాలపై చర్చించిన ఈటెల**



**హైదరాబాద్,ఆగస్ట్28(ప్రజావినికిడి):** తెలంగాణ ప్రజల పరిస్థితి పెనం మీది నుంచి పొయ్యిలో పడ్డట్లుగా తయారయ్యిందని మల్కాజ్‌గిరి బిజెపి ఎంపీ ఈటల రాజేందర్ అన్నారు. కెసిఆర్‌ను కాదని ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే అంతకు మించి అన్నట్లుగా అవినీతి పాలన సాగుతోందని మండిపడ్డారు. తెలంగాణలో కేసీఆర్ పాలనలాగానే.. రేవంత్ రెడ్డి పాలన కూడా తయారయ్యింని ఈటల రాజేందర్ విమర్శించారు. రేవంత్ రెడ్డి పాలనతో పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డామని రాష్ట్ర ప్రజలు భావిస్తున్నారని తెలిపారు. శుక్రవారం తెలంగాణ సెక్రటేరియట్‌లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజుతో ఎంపీ ఈటల రాజేందర్ భేటీ అయ్యారు. అనంతరం సెక్రటేరియట్ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. కేంద్రం ఐదు కిలోల సన్న బియ్యం ప్రజలకు ఇస్తున్నా.. ప్రధాని మోదీ పోటో వేయడం లేదని మండిపడ్డారు. ఎవరి జాగీరని మీ ఫొటోలు వేసుకుంటున్నారంటూ కాంగ్రెస్ ప్రభుత్వంలోని నేతలపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. బియ్యం ఇచ్చేది కేంద్రమైతే మీ బొమ్మలెందుకని ప్రశ్నించారు. కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ.. యూఎస్, యూరప్ వెళ్లి.. భారత్‌లో మత కల్లోలాలు జరుగుతున్నాయని అంటారని విమర్శించారు. లుంబిని పార్క్, గోకుల్ చాట్ వద్ద ఎవరి హయాంలో బాంబులు పేలాయని కాంగ్రెస్ పార్టీ నేతలను ఆయన సూటిగా ప్రశ్నించారు. సీఎం రేవంత్.. దేశ రాజధాని ఢిల్లీకి వచ్చి మీ ఆశీర్వాదంతోపాటు మీ మద్దతు కావాలంటారని వ్యంగ్యంగా అంటారని తెలిపారు. ఇక్కడికి వచ్చి అదే సీఎం రేవంత్.. ప్రధాని మోదీపై విమర్శలు గుప్పిస్తారని పేర్కొన్నారు. మోదీ దేశానికి ప్రధాని కాబట్టే రాష్ట్రానికి ఇన్ని రహదారులు, రైల్వే అభివృద్ధికి నిధులు వచ్చాయని ఎంపీ ఈటల వివరించారు. రాష్ట్రాల అభివృద్ధిలోనే దేశాల అభివృద్ధి ఉందని మోదీ అంటారని గుర్తు చేశారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను కేంద్ర ప్రభుత్వం మాకెంటి ఇచ్చేదని అన్నారన్నారు. అలాగే ప్రధాని మోదీ ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారని కేసీఆర్ ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. అసలు దేశ ప్రధాని మోదీని బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ కేర్ చేయలేదన్నారు. అలా చేయడం రాష్ట్రాలకు మంచిది కాదని.. అరిష్టమని ఆయన తెలిపారు. తెలంగాణలో ఇందిరమ్మ కమిటీలు వేసి పార్టీ నాయకులకు కేటాయించుకుంటున్నారని మల్కాజ్‌గిరి ఎంపీ విమర్శించారు. మీ తాత జాగీరు కాదు అలా చేయడానికి అంటూ కాంగ్రెస్ నేతలపై నిప్పులు చెరిగారు. ఇందిరమ్మ ఇళ్లపై కేంద్రానికి ఎలాంటి వివక్షత లేదన్నారు. మూడు సంవత్సరాలలో రాష్ట్ర ప్రభుత్వం అడిగిన దాని కంటే రూ.100 కోట్లు అధికంగా కేంద్రం ఇచ్చిందన్నారు. మెట్రో ఫేజ్ -1, ఫేజ్ -2 కు కేంద్ర ప్రభుత్వం సహకారం అందిస్తుందని పేర్కొన్నారు. హైదరాబాద్ చుట్ట పక్కల గ్రామాలను కూడా కలిపారని చెప్పారు. కానీ వాటిని పట్టించుకోవట్లేదని విమర్శించారని ఓవర్ బ్రిడ్జ్ (ఆర్ఓబీ), రైలు అండర్ బ్రిడ్జ్ (ఆర్‌యూబీ) సదుపాయం లేకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. వీటి నిర్మాణం చేయాలని కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్విన్ వైష్ణవ్‌ను కలిసి విజ్ఞప్తి చేశామన్నారు. కేంద్రం సహకరిస్తుందని.. కానీ రూపాయి ఇవ్వక పోయినా రాష్ట్ర ప్రభుత్వం సహకారం కావాలని కేంద్ర మంత్రి వివరించారని ఎంపీ ఈటల ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ అంశంపై తెలంగాణ సీఎస్‌ను కలిసి మాట్లాడానని రేవంత్ తెలిపారు. హైదరాబాద్‌లో అర్బన్, రూరల్ హౌసింగ్ స్కీం పనులు వేగంగా చేయాలని సీఎస్‌ను కోరినట్లు ఎంపీ ఈటల వివరించారు. రైల్వే పెద్ద టెండర్లలో పాల్గొని నగదు తీసుకుంటున్నారని.. కానీ చిన్న చిన్న టెండరల్లో పాల్గొనట్లేదంటూ ఆయన అసహనం వ్యక్తం చేశారు. దీని వల్ల అభివృద్ధి కావడం లేదన్నారు. మేడ్చల్, మల్కాజ్‌గిరి రైల్వే స్టేషన్లకు అమృత్ పథకంలో భాగంగా రూ.22 కోట్లు కేంద్రం ఇస్తుందని అన్నారు. అన్ని రైల్వేస్టేషన్లు ఫేస్ లిఫ్టింగ్ చేయడానికి కేంద్ర మంత్రి హామీ ఇచ్చారని చెప్పారు. మేడ్చల్, సికింద్రాబాద్ పరిధిలో గేట్ల వద్ద ఆర్‌వోబీ, ఆర్‌యూబీ నిర్మాణం జరుగుతోందని అన్నారు.

## ముఖ్యమంత్రికి రాఖీలు కట్టిన మహిళా నేతలు, బ్రహ్మాకుమారీలు





**ఉండవల్లి, ఆగస్టు 28 (ప్రజావినికిడి):** రాఖీ పౌర్ణమి సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుకి పలువురు మహిళా నేతలు, బ్రహ్మకుమారీలు రాఖీలు కట్టారు. సీఎం క్యాంప్ కార్యాలయంలో ముఖ్యమంత్రికి రాఖీలు కట్టి తమ అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు వారికి రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. సీఎంను కలిసిన వారిలో మంత్రి సవిత, మాజీమంత్రి సుజాత, ఎన్టీఆర్ జిల్లా టీడీపీ అధ్యక్షురాలు గద్దె అనురాధ, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి ఆచంట సునీత, తదితరులు ఉన్నారు.

# నియోజకవర్గాల విజన్ ప్లాన్..



## పనితీరుకు అదే ప్రామాణికం: సీఎం చంద్రబాబు

**ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులతో చంద్రబాబు టెలీకాన్ఫరెన్స్**

**ప్రజాప్రతినిధులు నిరంతరం సమీక్షలు జరుపుతూ ప్రజలకు జవాబుదారీగా ఉండాలని ఆదేశం**

**అన్ని స్థాయిల్లో పొలిటికల్ గవర్నెన్స్, ప్రజా భాగస్వామ్యంతోనే మెరుగైన ఫలితాలు**

**టెక్నాలజీని వాడుకుంటూ వినూత్నంగా ఆలోచించాలని సూచన**

**రాష్ట్ర విజన్ ప్లాన్ యూనిట్‌కు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని వెల్లడి**

**అమరావతి,ఆగస్టు 28 (ప్రజావినికిడి):**
రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలపడం, పేదరిక రహిత సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'స్వర్ణ నియోజకవర్గం విజన్ యాక్షన్ ప్లాన్' పనితీరుకు ప్రామాణికంగా నిలుస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. ఈ ప్రణాళిక అమలులో ప్రజాప్రతినిధులు, అధికారులు కీలక పాత్ర పోషించాలని, ప్రజల భాగస్వామ్యంతోనే అద్భుత ఫలితాలు సాధించగలమని ఆయన దిశానిర్దేశం చేశారు. శుక్రవారం తన క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గాల విజన్ యాక్షన్ ప్లాన్ యూనిట్లపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ




సందర్భంగా మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లతో పాటు యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్స్‌తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు. **మొదటి పేజీ తరువాయి**
నియోజకవర్గాల వారీగా నిర్దిష్ట విజన్ ప్లాన్‌ను రూపొందించుకుని అమలు చేయడం దేశంలోనే ఆంధ్రప్రదేశ్‌లో ప్రప్రథమంగా జరుగుతోందని, ఈ వినూత్న కార్యక్రమానికి జాతీయ స్థాయిలో మంచి గుర్తింపు లభించిందని ముఖ్యమంత్రి తెలిపారు. కీ-పెర్ఫామెన్స్ ఇండికేటర్లకు అనుగుణంగా ప్రతి రంగంలో వృద్ధి సాధించేలా పనిచేయాలని ప్రజాప్రతినిధులకు సూచించారు. క్షేత్రస్థాయిలో నిర్వహించే సమీక్షలు మొక్కుబడిగా కాకుండా, ప్రజలకు పూర్తిగా జవాబుదారీగా ఉండేలా చూడాలని ఆదేశించారు. అన్ని స్థాయిల్లోనూ పొలిటికల్ గవర్నెన్స్ సమర్థవంతంగా అమలైనప్పుడే సుపరిపాలన సాధ్యమవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రభుత్వ నిర్ణయాలు, అభివృద్ధి కార్యక్రమాల్లో ప్రజలను భాగస్వాములను చేసినప్పుడు అద్భుత ఫలితాలు వస్తాయని, ఉత్తరాంధ్ర ప్రజల చిరకాల స్వప్నమైన భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభోత్సవానికి లభించిన ప్రజా స్పందనే ఇందుకు నిదర్శనమని గుర్తుచేశారు.
ఈ విజన్ ప్లాన్ అమలులో యంగ్ ప్రొఫెషనల్స్, నాలెడ్జ్ పార్ట్‌నర్లు, స్వర్ణ కార్యాలయాల సిబ్బంది పాత్ర అత్యంత కీలకమని సీఎం పేర్కొన్నారు. సంప్రదాయ ధోరణి వీడి వినూత్నంగా ఆలోచించాలని, స్థానిక వనరులను సద్వినియోగం చేసుకుంటూ ఆయా నియోజకవర్గాల అభివృద్ధికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. ఇందుకోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'డేటా లేక్' లోని సమాచారాన్ని విశ్లేషించుకోవాలని, టెక్నాలజీని పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ఆదేశించారు. ఉద్యోగుల సామర్థ్యం పెంచేందుకు ఇప్పటికే 1.50 కోట్ల ఆన్‌లైన్ కోర్సులు పూర్తి చేశారని తెలిపారు. ప్రభుత్వ లక్ష్యం కేవలం నగదు బదిలీ కాదని, లబ్ధిదారులను ఆర్థికంగా నిలబెట్టి వారిలో సాధికారత తీసుకురావడమేనని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. ప్రా4 ప్రాజెక్టు ద్వారా పేదలకు అవసరమైన చేయూత అందిస్తున్నామని, ప్రతి నియోజకవర్గంలో తలసరి ఆదాయం పెంచడమే లక్ష్యంగా పనిచేయాలని పిలుపునిచ్చారు.

# డిఎస్సీపై చర్చకు సిద్ధమన్నా జవాబేదీ

**మంత్రి లోకేశ్ మరోమారు విమర్శలు**

**ఒంగోలు,ఆగస్టు 28 (ప్రజావినికిడి):**
"జగన్.. నీకు పదోసారి సవాల్ విసురుతున్నా. డేట్, టైమ్, ప్లేస్ ఫిక్స్ చెయ్. పులివెందులకు రమ్మన్నా వస్తా, తాడేపల్లిలోని నీ కొంపకు రమ్మన్నా వస్తా. చర్చకు నేను సిద్ధం, నువ్వు సిద్ధమా? ఏపీపీఎస్సీకి, డీఎస్సీకి తేడా తెలియని నువ్వు నాకు నీతులు చెబుతావా?" అంటూ విద్యాశాఖ మంత్రి, తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఒంగోలు అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యకర్తల సమన్వయ సమావేశంలో ఆయన శుక్రవారం పాల్గొని ప్రసంగించారు. జగన్ లాంటి చేతకాని నాయకుడిని తాను ఎన్నడూ చూడలేదని, ఆయనకు నిజం చెబితే తల వెయ్యి ముక్కలయ్యే శాపం ఉందని ఎద్దేవా చేశారు.

**డీఎస్సీ, వెలిగొండపై ఘాటు విమర్శలు**
గత ప్రభుత్వంలో డీఎస్సీపై 150 కేసులు వేయించినా, తాము విజయవంతంగా పూర్తిచేసి ఉద్యోగాలు ఇచ్చామని లోకేశ్ గుర్తుచేశారు. "అది మా చిత్తశుద్ధి. మీరు నిర్వహించిన గ్రూప్-1 అవకతవకలపై కోర్టు పర్యవేక్షణలో విచారణ జరుగుతోంది. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని న్యాయస్థానమే చెప్పింది. ఈ ఏడాది మాత్రమే కాదు, రాబోయే మూడేళ్లు కూడా డీఎస్సీ నిర్వహిస్తాం. జగన్ వాళ్ల తాత వచ్చినా మమ్మల్ని అడ్డుకోలేరు" అని స్పష్టం చేశారు.
వెలిగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసింది చంద్రబాబేనని, త్వరలో పూర్తి చేసి ప్రారంభించేది కూడా చంద్రబాబేనని అన్నారు. పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని, ఇప్పుడు ఆర్ అండ్ ఆర్



ప్యాకేజీ ఇచ్చి పనులు పూర్తి చేస్తుంటే క్రెడిట్ చోరీ అంటున్నారని మండిపడ్డారు.

**స్థానిక ఎన్నికల్లోనూ గెలుపే లక్ష్యం**
త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు కార్యకర్తలు సిద్ధం కావాలని లోకేశ్ పిలుపునిచ్చారు. "అందరం కలిసికట్టుగా పనిచేస్తే సార్వత్రిక ఎన్నికల కంటే 2 శాతం అదనపు ఓట్లతో ఘన విజయం సాధిస్తాం. కార్యకర్తలు నా చుట్టూ కాదు, ప్రజల చుట్టూ తిరగండి. పదవులు ఇచ్చే బాధ్యత నాది" అని భరోసా ఇచ్చారు. మై టీడీపీ యాప్ ద్వారా 4 లక్షల మంది నాయకులను పర్యవేక్షిస్తున్నామని, పార్టీ కార్యక్రమాలను సీరియస్‌గా తీసుకోవాలని సూచించారు. ఒంగోలు పోతురాజు కాల్వ, నల్లకాలువల అభివృద్ధికి వచ్చే బడ్జెట్‌లో నిధులు కేటాయించే బాధ్యత తీసుకుంటానని హామీ ఇచ్చారు. అహంకారంతో వ్యవహరిస్తే ప్రజలకు దూరం అవుతామని హితవు పలికారు.

**మరో మూడుసార్లు గెలవాలి**
రాష్ట్రాన్ని పూర్తిగా గాడిలో పెట్టాలంటే కనీసం మరో మూడుసార్లు వరుసగా టీడీపీ కూటమి గెలవాల్సిన అవసరం ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. "గత ఎన్నికల్లో జనసేన, బీజేపీలతో కలిసి 94 శాతం సీట్లు గెలిచాం. మన ఐక్యత ఇలాగే కొనసాగాలి. సోషల్ మీడియాలో ఒకరిపై ఒకరు పోస్టులు పెట్టుకుంటే రాష్ట్రమే నష్టపోతుంది" అని అన్నారు.
తనపై గత ప్రభుత్వం 23 తప్పుడు కేసులు పెట్టిందని, వాటిలో అటెంప్ట్ మర్డర్, ఎస్సీ, ఎస్టీ కేసులు కూడా ఉన్నాయని గుర్తుచేశారు. తాను జగన్‌లా కంచుకోటలో పోటీ చేయలేదని, 40 ఏళ్లలో గెలవని మంగళగిరిలో 91 వేల మెజారిటీతో గెలవడం తన సత్తా అని అన్నారు.

**జగన్ తప్పులకు వైసీపీ నేతల బలి**
జగన్ చేసిన తప్పుడు పనుల వల్లే కొందరు వైసీపీ నాయకులు ఈరోజు జైళ్లకు వెళుతున్నారని, ఇప్పుడు వారంతా కులం కార్డు వాడుతున్నారని లోకేశ్ ఆరోపించారు. బీసీలకు 10 శాతం రిజర్వేషన్లు తగ్గించి 17 వేల మందికి పదవులు రాకుండా అడ్డుకున్నారని విమర్శించారు. అమర్‌నాథ్ గౌడ్, నందం సుబ్బయ్య, తోట చంద్రయ్య హత్యలను ప్రస్తావిస్తూ వైసీపీ పాలనలో అరాచకాలు పెరిగాయన్నారు. మాజీ మంత్రులు సీదిరి అప్పలరాజు, కారుమూరి నాగేశ్వరరావుల ఉదంతాలను ఉటంకిస్తూ.. వారు చేసిన తప్పుల వల్లే చట్టపరమైన చిక్కుల్లో పడ్డారని, దీనికి ప్రభుత్వానికి సంబంధం లేదని స్పష్టం చేశారు.
కార్యక్రమంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆనం రాంనారాయణరెడ్డి, ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్, పలువురు టీడీపీ ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. రాష్ట్రం ప్రస్తుతం కఠిన పరిస్థితుల్లో ఉందని, రూపాయి ఆదాయంలో 94 పైసలు జీతాలకే పోతోందని, అయినా చంద్రబాబు రాష్ట్రాన్ని నంబర్ వన్‌గా నిలపడానికి అహర్నిశలు శ్రమిస్తున్నారని లోకేశ్ తెలిపారు.

# మూడు దశాబ్దాల వెలిగొండ కల సాకారం

**అర్హులైన ప్రతి నిర్వాసితుడికీ పరిహారం**

**-రికార్డుల్లో లోపాలున్నా ఆందోళన అవసరం లేదు**

**-రూ.169 కోట్ల అదనపు భారమైనా ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేస్తాం**

**-జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**



**అమరావతి, ఆగస్టు 28 (ప్రజావినికిడి):**
ఉమ్మడి ప్రకాశం జిల్లాలోని కరువు, ఫ్లోరైడ్ ప్రభావిత ప్రాంతాలకు సాగు, తాగునీరు అందించాలనే మూడు దశాబ్దాల వెలుగొండ కలను సాకారం చేయడమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం కోసం విలువైన భూములు, ఆస్తులు, స్వగ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యున్నత ప్రాధాన్యం ఇస్తోందని స్పష్టం చేశారు. 1996లో ముఖ్యమంత్రి చంద్రబాబు వెలుగొండ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారని గుర్తుచేశారు. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ఎట్టి పరిస్థితుల్లోనూ 2026 ఆగస్టు నాటికి వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేయాలనే లక్ష్యాన్ని ముఖ్యమంత్రి నిర్దేశించారని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన రెండేళ్లలో వెలుగొండ ప్రాజెక్టు పనుల కోసం సుమారు రూ.2,250 కోట్లకు పైగా నిధులు ఖర్చు చేసి, రాత్రింబవళ్లు పనులు కొనసాగిస్తూ ప్రాజెక్టు నిర్మాణాన్ని వేగవంతం చేసిందని మంత్రి తెలిపారు.ప్రభుత్వం బాధ్యతలు చేపట్టే సమయానికి వెలుగొండ హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించిన వింగ్స్, వాల్స్ పనులు పూర్తికాని పరిస్థితి ఉండేదని చెప్పారు. 2025 మేలో పనులు ప్రారంభించి, 2026 మే నాటికి హెడ్ రెగ్యులేటర్‌కు సంబంధించిన వింగ్స్, వాల్స్ పనులను పూర్తి చేసినట్లు వివరించారు. టన్నెల్-1 కు సంబంధించి సుమారు 1.20 లక్షల క్యూబిక్ మీటర్ల మట్టి తొలగింపు పనులు, టన్నెల్-2కు సంబంధించి సుమారు 4,990 మీటర్ల బెంచింగ్ పనులు, 6,990 మీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేసినట్లు మంత్రి వెల్లడించారు.

వెలుగొండ ప్రాజెక్టులో కీలకమైన 11,000 క్యూసెక్కుల సామర్థ్యం కలిగిన ఫీడర్ కెనాల్ పనులకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యం ఇచ్చిందని మంత్రి తెలిపారు. ఈ పనులకు సుమారు రూ.5,460 కోట్ల నిధులు మంజూరు చేసి, టెండర్లు పిలిచి పనులను వేగవంతం చేసినట్లు చెప్పారు.ఫీడర్ కెనాల్‌లో భాగంగా 5.3 కిలోమీటర్ల పీసీ వాల్ నిర్మాణం, 11 కిలోమీటర్ల లైనింగ్ పనులు పూర్తి చేసినట్లు మంత్రి వివరించారు. ప్రాజెక్టు డిజైన్‌లోని కీలక పనులను దశలవారీగా పూర్తి చేస్తూ వెలుగొండ ప్రాజెక్టును ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణం ఎంత ముఖ్యమో, ప్రాజెక్టు కోసం త్యాగాలు చేసిన నిర్వాసితుల సంక్షేమం కూడా ప్రభుత్వానికి అంతే ముఖ్యమని మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు.వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసితులకు సుమారు రూ.900 కోట్లు చెల్లించాల్సి ఉండగా, గత ఐదేళ్లలో వారికి ఎలాంటి చెల్లింపులు జరగలేదని మంత్రి ఆరోపించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కేవలం 40 రోజుల్లో మూడు విడతల్లో సుమారు రూ.768 కోట్లను నిర్వాసితులకు చెల్లించినట్లు తెలిపారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు చేపట్టామని చెప్పారు. వెలుగొండ ప్రాజెక్టు పరిధిలోని 11 ముంపు గ్రామాలకు 11 కమిటీలను ఏర్పాటు చేసి, జిల్లా స్థాయి అధికారులు, జలవనరుల శాఖ అధికారులు, సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో నిర్వాసితుల గ్రీవెన్స్‌లను పరిశీలిస్తున్నట్లు మంత్రి తెలిపారు.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రాజెక్టుల నిర్మాణం కోసం భూములు, ఆస్తులను త్యాగం చేసిన ప్రతి ఒక్క నిర్వాసితుడికి న్యాయం చేయాలనే సంకల్పంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కీలక నిర్ణయం తీసుకున్నారని మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు.సామాజిక, ఆర్థిక సర్వేలో పేరు లేకపోయినా, గెజిట్‌లో నమోదు కాకపోయినా, కొత్త ఇల్లు ఉన్నా లేకపోయినా, పేర్లలో తేడాలు ఉన్నా ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని మంత్రి స్పష్టం చేశారు. రికార్డుల్లో ఉన్న లోపాలను మాత్రమే ప్రాతిపదికగా తీసుకోకుండా, వాస్తవ పరిస్థితులను పరిశీలించి అర్హత ఉన్న ప్రతి నిర్వాసితుడికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తెలిపారు.గత ప్రభుత్వ హయాంలో పరిహారం అందకుండా మిగిలిపోయిన వారితో పాటు, నిబంధనల ప్రకారం అర్హత సాధించలేదని నమోదైనప్పటికీ వాస్తవంగా అర్హులైన నిర్వాసితులను కూడా గుర్తించి వారికి పరిహారం అందించేందుకు ప్రభుత్వం నిర్ణయించిందని చెప్పారు.

అర్హులైన ప్రతి నిర్వాసితుడికి పరిహారం అందించే క్రమంలో ప్రభుత్వంపై అదనంగా సుమారు రూ.169 కోట్ల ఆర్థిక భారం పడుతున్నప్పటికీ, ఆ భారాన్ని లెక్కచేయకుండా ప్రతి నిర్వాసితుడికి న్యాయం చేయాలనే మానవతా దృక్పథంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ నిర్ణయం తీసుకున్నారని మంత్రి వెల్లడించారు.ప్రాజెక్టుల నిర్మాణం ద్వారా రైతులు, ప్రజలకు ప్రయోజనం కల్పించడం ఎంత ముఖ్యమో, ఆ ప్రాజెక్టుల కోసం తమ భూములు, ఆస్తులు, స్వగ్రామాలను త్యాగం చేసిన నిర్వాసితుల జీవితాల్లో వెలుగు నింపడం కూడా అంతే ముఖ్యమని ప్రభుత్వం భావిస్తోందన్నారు.

వెలుగొండ జలాలతో రైతులు, ప్రజలు, ఫ్లోరైడ్, కరువు ప్రభావిత ప్రాంతాల ప్రజల కళ్లల్లో కనిపించే ఆనందమే నిర్వాసితుల కళ్లల్లో కూడా కనిపించాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని స్పష్టం చేశారు.వెలుగొండ ప్రాజెక్టును పూర్తి చేసి ప్రకాశం ఉమ్మడి జిల్లాకు సాగు, తాగునీటి భద్రత కల్పించడంతో పాటు, ప్రాజెక్టు కోసం త్యాగం చేసిన ప్రతి నిర్వాసిత కుటుంబానికి సంపూర్ణ న్యాయం చేయడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు స్పష్టం చేశారు

# యర్రగొండపాలెం ఘటనపై విచారణ జరుపుతాం

**అనధికార వైద్య చర్యలను ఉపేక్షించేది లేదు**


**-రాష్ట్ర వైద్య మండలి అధ్యక్షుడు డాక్టర్ నంద కిశోర్ వెల్లడి**

**అమరావతి, ఆగస్టు 28 (ప్రజావినికిడి)::** ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో అనధికారికంగా నిర్వహించినట్లు ఆరోపణలు ఉన్న అబార్షన్ వికటించి ఓ మహిళ మృతి చెందిన ఘటనపై విచారణ జరుపుతామని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ వెల్లడించింది. వైద్యుడు ఫోన్‌లో సలహాలు ఇస్తుండగా, సిబ్బందితో అబార్షన్ ప్రక్రియ నిర్వహించినట్లు వచ్చిన వార్తలపై కౌన్సిల్ స్పందించింది. మండలిలో అంతర్భాగంగా ఉన్న యాంటీ క్వాకరీ కమిటీ ద్వారా ఘటనకు సంబంధించిన వాస్తవాలను నిర్ధారించి, కౌన్సిల్‌కు ఉన్న అధికారాల మేరకు తగిన చర్యలు తీసుకోనున్నట్లు కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ గార్లపాటి నంద కిశోర్ తెలిపారు. ఈ ఘటన అత్యంత విషాదకరమని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

"అనధికార వైద్యచర్యలు, అక్రమ వైద్య ప్రాక్టీస్‌ను అరికట్టేందుకు ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ ఇప్పటికే ఏర్పాటైన యాంటీ క్వాకరీ కమిటీకి డాక్టర్ సుబ్బా నాయుడు చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. నకిలీ వైద్యం అందించే వారిని గుర్తించి, తగిన చట్టపరమైన చర్యలు తీసుకునేలా సంబంధిత వైద్య ఆరోగ్య శాఖ, జిల్లా యంత్రాంగం, పోలీసు అధికారులతో కమిటీ సమన్వయంతో పనిచేస్తుంది. ఆధునిక వైద్యం అందించడానికి, మందులు సూచించడానికి, అబార్షన్ వంటి వైద్య ప్రక్రియలు నిర్వహించడానికి సంబంధిత వైద్య విద్యార్హతలతో పాటు చెల్లుబాటు అయ్యే వైద్య రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా ఉండాలి. అవసరమైన వైద్య అర్హతలు, చెల్లుబాటు అయ్యే రిజిస్ట్రేషన్ లేకుండా ఆధునిక వైద్య విధానాన్ని నిర్వహించడం చట్టవిరుద్ధమని ఆంధ్రప్రదేశ్ మెడికల్ కౌన్సిల్ చట్టంలోని సెక్షన్ 20, నేషనల్ మెడికల్ కమిషన్ చట్టం 2019లోని సెక్షన్ 34 స్పష్టం చేస్తోంది. ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగించే అనధికార వైద్యచర్యలు, అక్రమ వైద్య ప్రాక్టీస్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోం"" అని కౌన్సిల్ చైర్మన్ డాక్టర్ గార్లపాటి నంద కిశోర్ స్పష్టం చేశారు.

# అంబటి రాంబాబుకు అస్వస్థత.. స్టెంట్ వేసిన వైద్యులు

**అమరావతి, ఆగస్టు 28 (ప్రజావినికిడి):**
వైసీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి అంబటి రాంబాబు అస్వస్థతకు గురయ్యారు. దీంతో ఆయన్ను హుటాహుటిన హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వైద్యులు ఆయనకు అవసరమైన పరీక్షలు నిర్వహించి, స్టెంట్ అమర్చారు. ప్రస్తుతం ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ఆందోళన చెందాల్సిన అవసరం లేదని వైద్యులు స్పష్టం చేశారు.వివరాల్లోకి వెళితే, శుక్రవారం అంబటి రాంబాబు అస్వస్థతకు గురికావడంతో కుటుంబ



సభ్యులు మెరుగైన చికిత్స కోసం వెంటనే హైదరాబాద్‌కు తరలించారు. అక్కడి అపోలో ఆసుపత్రిలో చేరిన వెంటనే వైద్య బృందం ఆయనకు పలు వైద్య పరీక్షలు నిర్వహించింది. యాంజియోగ్రామ్ చేసి, ఆయనకు స్టెంట్ వేయాలని నిర్ణయించారు. ఆ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేశారు.ప్రస్తుతం అంబటి రాంబాబు వైద్యుల ప్రత్యేక పర్యవేక్షణలో ఉన్నారు. ఆయన ఆరోగ్యం నిలకడగా ఉందని, ప్రమాదం ఏమీ లేదని డాక్టర్లు వెల్లడించారు. ఈ వార్త తెలియగానే వైసీపీ నాయకులు, కార్యకర్తలు, ఆయన అభిమానులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు. అయితే, ఆయన ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు ప్రకటించడంతో అంతా ఊపిరి పీల్చుకున్నారు.

# జియో ఐపీవోకి సెబీ గ్రీన్ సిగ్నల్.. త్వరలో మార్కెట్లోకి!

**ఆగస్టు 28 ((ప్రజావినికిడి):**
దేశీయ కార్పొరేట్ రంగం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న జియో ప్లాట్‌ఫామ్స్ ఐపీవోకు మార్గం సుగమమైంది. రిలయన్స్ ఇండస్ట్రీస్ డిజిటల్ విభాగమైన జియో ప్లాట్‌ఫామ్స్ పబ్లిక్ ఇష్యూకు మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ (సెబి) శుక్రవారం (ఆగస్టు 28న) తుది ఆమోదం తెలిపింది. ఈ అనుమతి లభించడంతో నిధుల సమీకరణ ప్రక్రియను ప్రారంభించేందుకు కంపెనీకి లైన్ క్లియర్ అయింది.ఈ ఐపీవో ద్వారా





సుమారు 4 బిలియన్ డాలర్లు (దాదాపు రూ. 37,700 కోట్లు) సమీకరించాలని జియో లక్ష్యంగా పెట్టుకుంది. ఈ లక్ష్యం నెరవేరితే, ఇటీవలే వచ్చిన హ్యుందాయ్ మోటార్ ఐపీవో (రూ. 27,000 కోట్లు)ను అధిగమించి, భారత స్టాక్ మార్కెట్ చరిత్రలోనే అతిపెద్ద పబ్లిక్ ఇష్యూగా ఇది రికార్డు సృష్టిస్తుంది. ఈ ఐపీవో కోసం జియో ప్లాట్‌ఫామ్స్ జూన్ నెలలోనే సెబీకి ముసాయిదా పత్రాలను సమర్పించింది.ఈ పబ్లిక్ ఇష్యూలో భాగంగా కంపెనీ సుమారు 27 కోట్ల ఈక్విటీ షేర్లను విక్రయించనుంది. దీనివల్ల కంపెనీ మొత్తం ఈక్విటీలో 2.9 శాతం వాటా విక్రయానికి రానుంది. గత కొన్నేళ్లుగా మదుపర్లు, మార్కెట్ విశ్లేషకులు జియో ఐపీవో కోసం ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్న విషయం తెలిసిందే. 2020లోనే జియో ప్లాట్‌ఫామ్స్‌లో మెటా (ఫేస్‌బుక్) రూ.43,574 కోట్లు, గూగుల్ రూ.33,737 కోట్ల మేర పెట్టుబడులు పెట్టాయి. వీటితో పాటు మరికొన్ని అంతర్జాతీయ సంస్థల నుంచి కూడా కంపెనీ భారీగా నిధులను సమీకరించింది. ఈ పరిణామాల నేపథ్యంలో, జియో ఐపీవో భారత మార్కెట్‌లో ఒక చారిత్రక ఘట్టంగా నిలిచిపోతుందని నిపుణులు అంచనా వేస్తున్నారు.

# దీర్ఘకాలిక నొప్పికి మెదడులోనే "బ్రేక్".

## స్టాన్‌ఫోర్డ్ శాస్త్రవేత్తల పరిశోధనలో కొత్త ఆశలు

**అమరావతి, ఆగస్టు 28(ప్రజావినికిడి):**
సంవత్సరాల తరబడి వేధించే దీర్ఘకాలిక నొప్పితో బాధపడేవారికి వైద్య శాస్త్రం కొత్త ఆశను చూపిస్తోంది. మెదడులో నొప్పికి కారణమయ్యే సంకేతాలను గుర్తించి, వాటిని విద్యుత్ ప్రేరణతో అడ్డుకోవడం ద్వారా తీవ్రమైన నొప్పిని నియంత్రించవచ్చని శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ప్రతి వ్యక్తి మెదడులోని నొప్పి వ్యవస్థను ప్రత్యేకంగా మ్యాపింగ్ చేసి, దానికి అనుగుణంగా చికిత్స అందించే ఈ నూతన విధానం వైద్య రంగంలో ఒక కీలక ముందడుగుగా భావిస్తున్నారు. ఈ పరిశోధన వివరాలు 'బ్రెయిన్ స్టిమ్యులేషన్' జర్నల్‌లో ప్రచురితమయ్యాయి.

స్టాన్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయానికి చెందిన న్యూరో సర్జన్ వివేక్ బుచ్ నేతృత్వంలోని బృందం ఈ పరిశోధనను చేపట్టింది. తీవ్రమైన ముఖ నొప్పితో (ట్రైజెమినల్ సంబంధిత నొప్పి) బాధపడుతున్న ముగ్గురు వ్యక్తులపై ఈ ప్రయోగాత్మక చికిత్సను పరీక్షించారు. ఇందులో భాగంగా, వారి మెదడులో తాత్కాలికంగా ఎలక్ట్రోడ్లను అమర్చారు. కొన్ని రోజుల పాటు మెదడులోని వేర్వేరు ప్రాంతాలలో విద్యుత్ ప్రేరణ ఇచ్చి, నొప్పికి సంబంధించిన నాడీ సంకేతాలు ఎక్కడ, ఎలా ఉత్పన్నమవుతున్నాయో మ్యాపింగ్ చేశారు. అనంతరం,



ఆ నిర్దిష్ట ప్రాంతంలో లక్షిత విద్యుత్ తరంగాలను పంపి నొప్పి సంకేతాలకు 'బ్రేక్' వేశారు.

సాధారణంగా గాయం కారణంగా వచ్చే నొప్పి (అక్యూట్ పెయిన్) గాయం నయమవ్వగానే తగ్గిపోతుంది. కానీ దీర్ఘకాలిక నొప్పి (క్రానిక్ పెయిన్) అలా కాదు. గాయం మానిపోయినా, మెదడు మరియు వెన్నుపాములో కలిగే మార్పుల వల్ల ఇది నెలల తరబడి, ఏళ్ల తరబడి కొనసాగుతుంది. దీనికి చికిత్సగా డీప్ బ్రెయిన్ స్టిమ్యులేషన్ (ఐడీూ) పద్ధతి అందుబాటులో ఉన్నప్పటికీ, ఫలితాలు అంతంతమాత్రంగానే ఉంటున్నాయి. ఎందుకంటే, నొప్పికి సంబంధించిన నాడీ వ్యవస్థ ఒక్కో వ్యక్తిలో ఒక్కోలా ఉంటుంది. అయితే, ఈ కొత్త విధానంలో ప్రతి వ్యక్తి మెదడుకు ప్రత్యేకంగా మ్యాపింగ్ రూపొందించి చికిత్స అందించడం వల్ల సత్ఫలితాలు వస్తున్నాయని పరిశోధకులు తెలిపారు.

ఈ అధ్యయనంలో పాల్గొన్న ముగ్గురిలో ఒకరికి పెద్దగా ఉపశమనం లభించలేదు. కానీ, మిగిలిన ఇద్దరు మాత్రం నొప్పి నుంచి గణనీయమైన ఉపశమనం పొందారు. వారిలో ఒకరైన 40 ఏళ్ల మహిళకు, పరీక్షల అనంతరం శాశ్వత ఇంప్లాంట్లు అమర్చారు. చికిత్స తర్వాత 6 నెలలకు, ఏడాదికి కూడా తన నొప్పి చాలా వరకు తగ్గిపోయిందని ఆమె పరిశోధకులకు నిరంతరం తెలియజేస్తున్నారు. ఫలితాల పట్ల సంతృప్తి చెందిన రెండో వ్యక్తి కూడా త్వరలోనే శాశ్వత ఇంప్లాంట్ చేయించుకోవాలని యోచిస్తున్నారు.

ఇది చాలా తక్కువ మందిపై జరిపిన ప్రాథమిక దశ పరిశోధన మాత్రమేనని, దీనిని విస్తృత స్థాయిలో అందుబాటులోకి తీసుకురావడానికి మరిన్ని అధ్యయనాలు అవసరమని శాస్త్రవేత్తలు స్పష్టం చేశారు. ఏదేమైనా, ఇప్పటివరకు చికిత్సకు లొంగని మొండి దీర్ఘకాలిక నొప్పి కేసులకు ఈ వ్యక్తిగతీకరించిన మ్యాపింగ్ విధానం ఒక సరికొత్త మార్గాన్ని చూపుతుందని నిపుణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

# రాఖీ పండుగకు టీజీఎస్ఆర్టీసీ ఛార్జీల బాదుడు

**ఆగస్టు 28(ప్రజావినికిడి):**
రాఖీ పౌర్ణమి వేళ ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ, టికెట్ ధరలను భారీగా పెంచడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. పండుగ పూట తమ స్వగ్రామాలకు వెళ్లే సామాన్య ప్రయాణికులకు ఈ అదనపు ఛార్జీల బాదుడు



భారంగా మారింది.రాఖీ పండుగను పురస్కరించుకుని ఆగస్టు 27 నుంచి 31 వరకు రాష్ట్రవ్యాప్తంగా సుమారు 5,000 ప్రత్యేక బస్సులను నడపాలని టీజీఎస్ఆర్టీసీ నిర్ణయించింది. అయితే, ఈ బస్సుల్లో సాధారణ ఛార్జీల కంటే 50 శాతం అదనంగా వసూలు చేస్తున్నారు. ఉదాహరణకు, మహాత్మా గాంధీ బస్ స్టేషన్ (ఎంజీబీఎస్) నుంచి జడ్చర్లకు సాధారణ ఛార్జీ రూ. 150 ఉండగా, ప్రత్యేక బస్సుల్లో దానిని రూ. 190కి పెంచారు. అదేవిధంగా, కరీంనగర్‌కు వెళ్లే సూపర్ డీలక్స్ బస్సులో సాధారణ టికెట్ ధర రూ. 300 ఉండగా, ప్రస్తుతం రూ. 400 వసూలు చేస్తున్నారు.ఛార్జీల పెంపుపై ముందస్తు సమాచారం లేకపోవడంతో బస్సు ఎక్కిన తర్వాత తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ధరల పెంపుపై ముందే ప్రకటన విడుదల చేస్తే బాగుండేదని పలువురు ప్రయాణికులు అభిప్రాయపడుతున్నారు. ఈ అంశంపై టీజీఎస్ఆర్టీసీ పీఆర్‌వో ప్రసన్న స్పందిస్తూ వివరణ ఇచ్చారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ హయాంలో 1981లో వెలువడిన ప్రభుత్వ ఉత్తర్వుల (జీవో) ప్రకారం, పండుగ సమయాల్లో నడిపే ప్రత్యేక బస్సుల్లో సాధారణ ధర కంటే 1.5 రెట్లు అధికంగా వసూలు చేసే వెసులుబాటు సంస్థకు ఉందని ఆమె స్పష్టం చేశారు.

# నేపాల్‌లో జల ప్రళయం.. 547కి చేరిన మృతుల సంఖ్య

**ఆగస్టు 28(ప్రజావినికిడి):**
నేపాల్-టిబెట్ సరిహద్దులోని హిమాలయ ప్రాంతంలో సంభవించిన ఆకస్మిక వరదలు పెను విషాదాన్ని మిగిల్చాయి. ఈ జల ప్రళయంలో నేపాల్‌లో మరణించిన వారి సంఖ్య 547కి పెరిగినట్లు అధికారులు ధృవీకరించారు. వందలాది మంది ఇప్పటికీ గల్లంతయ్యారని, వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. భోటేకోషి నదిలో నీటిమట్టం ప్రమాదకర స్థాయిలో పెరుగుతుండటంతో మళ్లీ వరదలు వచ్చే ప్రమాదం ఉందని, ఈ కారణంగా సహాయక బృందాలు అత్యంత జాగ్రత్తగా ముందుకు సాగుతున్నాయి.రసువా జిల్లాలో వరదల నుంచి ప్రాణాలతో బయటపడిన కస్టమ్స్ ఏజెంట్ రాజు బుధతోకి మాట్లాడుతూ, "భూమి ఒక్కసారిగా కంపించినట్లు అనిపించింది. కళ్ళు తెరిచేలోపే వరద నీరు ఉవ్వెత్తున ఎగిసిపడి ఇళ్లను తుడిచిపెట్టేసింది. ఈ ప్రమాదం నుంచి బయటపడటం నాకు పునర్జన్మ లాంటిది" అని ఆ భయానక క్షణాలను గుర్తుచేసుకున్నారు.ఈ విపత్తు ప్రభావం చైనా వైపున ఉన్న టిబెట్‌పైనా తీవ్రంగా పడింది. నేపాల్ సరిహద్దులోని పోర్టు వద్ద సంభవించిన వరదల్లో ఐదుగురు మరణించగా, 260 మంది విదేశీయులతో సహా 558 మంది గల్లంతయ్యారని చైనా అధికారులు ప్రకటించారు. ఈ ఘటనపై చైనా అధ్యక్షుడు షీ జిన్‌పింగ్ కమ్యూనిస్ట్ పార్టీ అత్యవసర సమావేశం నిర్వహించి సహాయక చర్యలపై సమీక్షించారు. నేపాల్‌లోని ఎత్తైన హిమానీనదం (గ్లేసియర్) ఒకటి కూలిపోవడం వల్లే ఈ విపత్తు సంభవించి ఉండవచ్చని చైనా ప్రాథమికంగా అంచనా వేస్తోంది.ఖాట్మండులోని శాస్త్రవేత్తలు కూడా ఇదే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు. హిమానీనదం కూలిపోవడం, మంచు-రాళ్ల చరియలు విరిగిపడటంతో లెండే నదికి తాత్కాలికంగా ఆనకట్టలా అడ్డుపడిందని, అది ఒక్కసారిగా తెగిపోవడంతో, అక్కడ్నించి భోటేకోషి నదిలోకి ఈ స్థాయిలో వరద ప్రవాహం దూసుకొచ్చిందని భావిస్తున్నారు.ఈ పెను విషాదంపై అంతర్జాతీయ సమాజం స్పందిస్తోంది. నేపాల్ ప్రధాని బాలేంద్ర షా, ఆయన కేబినెట్ మంత్రులు తమ ఒక నెల జీతాన్ని విపత్తు సహాయ నిధికి విరాళంగా ప్రకటించారు. ఖాట్మండులోని మహాకాళ్ శని భగవాన్ ఆలయంలో బాధితుల ఆత్మశాంతి కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. వరదల్లో చిక్కుకున్న భారత పర్యాటకులను భారత రాయబారి నవీన్ శ్రీవాస్తవ కలిసి ధైర్యం చెప్పారు. యునైటెడ్ కింగ్‌డమ్ 5 మిలియన్ పౌండ్ల ఆర్థిక సహాయంతో పాటు, అత్యవసర సహాయక బృందాలను పంపడానికి ముందుకొచ్చింది. గల్లంతైన వారిలో సుమారు 33 మంది బ్రిటిష్ పౌరులు ఉన్నట్లు సమాచారం. సరిహద్దుల్లో అంతర్జాతీయ సహాయక చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

# డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడం కష్టం: హనుమ విహారి

శ్రీలంకతో రెండో టెస్ట్ డ్రా చేసుకున్న టీమిండియా వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్ చేరడం చాలా కష్టమని వెటరన్ బ్యాటర్ హనుమ విహారి అన్నాడు. శ్రీలంకతో రెండో టెస్ట్‌ను భారత్ గెలిచి ఉంటే డబ్ల్యూటీసీ అవకాశాలు ఇంకాస్త మెరుగ్గా ఉండేవని అభిప్రాయపడ్డాడు. కొలంబో వేదికగా జరిగిన రెండో టెస్ట్‌ను టీమిండియా చేజేతులా డ్రా చేసుకున్న సంగతి తెలిసిందే. సోనాల్ దినుషా అజేయ శతకంతో శ్రీలంక ఓటమిని తప్పించుకుంది. ఈ మ్యాచ్ ఫలితంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన హనుమ విహారి.. శ్రీలంక పోరాట పటిమను ప్రత్యేకంగా కొనియాడాడు. ఈ సిరీస్‌ను భారత్ గెలిచినా.. శ్రీలంక మనసులను గెలిచిందని చెప్పుకొచ్చాడు. 'అద్భుతమైన పోరాటంతో శ్రీలంక మనసులను



గెలిచింది. సోనాల్ దినుషా అద్భుతంగా బ్యాటింగ్ చేశాడు. తన ఫస్ట్ క్లాస్ అనుభవం చూపించాడు. స్వీప్, రివర్స్ స్వీప్ షాట్స్‌తో భారత బౌలర్లను సమర్థవంతంగా ఎదుర్కొన్నాడు. రెండు మ్యాచ్‌ల్లో మూడు సెంచరీలు చేశాడు. క్వాలిటి బౌలింగ్‌ను ఎలా ఎదుర్కోవాలో అలా ఆడాడు. శ్రీలంక దిగ్గజాలైన కుమార సంగక్కర, మహేళ జయవర్దనే, సనత్ జయసూర్య వంటి దిగ్గజ ఆటగాళ్ల తరహాలో సోనాల్ దినుషా గొప్ప ఆటగాడిగా ఎదుగుతాడు. భారత్ విషయానికి వస్తే.. టాస్ గెలవడం కలిసొచ్చింది. దేవదత్ పడిక్కల్ అద్భుతమైన బ్యాటింగ్‌తో మూడో స్థానాన్ని భర్తీ చేశాడు. ఐపీఎల్, ఫస్ట్ క్లాస్ క్రికెట్ ఫామ్‌ను కొనసాగించాడు. కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ కూడా బాగా ఆడారు. ధ్రువ్ జురెల్ కూడా అద్భుతంగా ఆడాడు. టాప్-5లో ఆడే సామర్థ్యం తనకు ఉందని నిరూపించుకున్నాడు. ముఖ్యంగా స్పిన్ బౌలింగ్‌ను బాగా ఆడాడు. శుభ్‌మన్ గిల్ కూడా హాఫ్ సెంచరీతో పర్వాలేదనిపించాడు. యశస్వి జైస్వాల్ వైఫల్యమే ఆందోళనకు గురిచేసే విషయం. అతను మినహా బ్యాటింగ్ ఆర్డర్ మొత్తం అదరగొట్టింది. గత సిరీస్‌లతో పోల్చితే స్పిన్‌ను అద్భుతంగా ఆడింది. బౌలింగ్ విషయానికి వస్తే.. సిరాజ్ కాస్త అలసిపోయినట్లు కనిపించాడు. అతనికి ఈ మ్యాచ్ నుంచి విశ్రాంతి ఇచ్చి గుర్నూర్ బ్రార్‌ను ఆడించాల్సిందేమో. కుల్దీప్ యాదవ్ ఆడించినా బాగుండేది. సారాన్ష్ జైన్ వికెట్లు తీసినా.. అతని బౌలింగ్ శైలి శ్రీలంక పిచ్‌లకు సూటవ్వదు. చాలా స్లోగా బౌలింగ్ చేస్తాడు. దాంతో శ్రీలంక బ్యాటర్లు ఈజీగా స్వీప్ షాట్స్ ఆడారు. మానవ్ సుతార్ మాత్రం అదరగొట్టాడు. జడేజాకు పర్‌ఫెక్ట్ రిప్లేస్‌మెంట్ అతను. ఎలాంటి కండిషన్స్‌లోనైనా బౌలింగ్ చేయగలడు. ప్రసిధ్ కృష్ణ కూడా అద్భుతంగా బౌలింగ్ చేశాడు. ఈ సిరీస్‌ను భారత్ 2-0తో గెలవాల్సింది. ప్రస్తుత పరిస్థితుల్లో భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరడం కష్టం. 2-0తో గెలిస్తే పరిస్థితి మెరుగ్గా ఉండేది. భారత్ ఇంకా 7 మ్యాచ్‌లు ఆడాల్సి ఉండగా.. అందులో 6 గెలవాలి. న్యూజిలాండ్ గడ్డపై టీమిండియా రెండు టెస్ట్‌లు గెలవాలంటే అద్భుతం జరగాలి. ఆస్ట్రేలియాతో సొంతగడ్డపై ఐదు టెస్ట్‌ల్లో విజయం సాధించాలి. ప్రాక్టికల్‌గా ఇది అసాధ్యం.'అని హనుమ విహారి అభిప్రాయపడ్డాడు.

# గంభీర్‌పై మాజీ ఓపెనర్ సదగోపన్ రమేశ్ విమర్శలు



టీమిండియా హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్‌పై మాజీ ఓపెనర్ సదగోపన్ రమేశ్ విమర్శలు గుప్పించాడు. శ్రీలంకతో రెండో టెస్ట్ డ్రా కావడంతో గౌతమ్ గంభీర్ ముఖం చాటేసాడని మండిపడ్డాడు. భారత్‌కు ప్రతికూల ఫలితాలు ఎదురైనప్పుడల్లా గౌతమ్ గంభీర్ మీడియాకు దూరంగా ఉంటాడని, యువ ఆటగాళ్లకు ఆ బాధ్యతలు అప్పగిస్తాడని ఆరోపించాడు. భారత్ విజయం సాధించినప్పుడే మీడియా సమావేశంలో పాల్గొని ప్రగల్భాలు పలుకుతాడని విమర్శించాడు. శ్రీలంకతో తొలి టెస్ట్ విజయానంతరం మీడియాతో మాట్లాడుతూ.. గంభీర్ చేసిన వ్యాఖ్యలను కూడా రమేశ్ తప్పుబట్టాడు. తొలి టెస్ట్ విజయానంతరం గంభీర్ మాట్లాడుతూ.. ప్రస్తుత భారత జట్టు సంధి దశలో ఉందని చెప్పాడు. 'ర్యాంకింగ్స్ ముఖ్యం కాదు. టెస్ట్‌ల్లో టీమిండియా ఏ మాత్రం ఇబ్బంది పడటం లేదు. ఇంగ్లండ్ పర్యటన నుంచి మేం మెరుగైన ప్రదర్శనే చేశాం. హెడ్ కోచ్‌గా నా దృష్టిలో జట్టు పురోగతికి అంతిమ కొలమానం.. ర్యాంకింగ్స్, వ్యక్తిగత ప్రదర్శనల చుట్టూ ఉండే హడావిడి కాదు. జట్టు ట్రోఫీలు గెలవగలదా లేదా అన్నదే ముఖ్యం. ట్రోఫీలు గెలవడమే కోచ్‌గా నా పని. నేను పట్టించుకునేది, నమ్మేది కూడా అదొక్కటే. ఇతరుల అభిప్రాయాలు, ఇష్టాలతో నాకు పనిలేదు.' అని గంభీర్ స్పష్టం చేశాడు. ఈ వ్యాఖ్యలను గుర్తు చేసిన రమేశ్.. ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానం సాధించకుండా డబ్ల్యూటీసీ టైటిల్ ఎలా గెలుస్తారని ప్రశ్నించాడు. 'తొలి టెస్ట్ విజయం తర్వాత గంభీర్ మీడియా సమావేశంలో పాల్గొన్నాడు. భారత్ విజయం సాధిస్తేనే అతను మీడియాతో మాట్లాడుతాడనే విషయం అందరికి తెలుసు. ఓడితే ఇతరులను పంపిస్తాడు. ర్యాంకింగ్స్ ముఖ్యం కాదని, టెస్ట్‌లో భారత్ ఇబ్బంది పడటం లేదని అంటాడు. ఇలా ఎలా చెబుతాడు. ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానంలో ఉంటేనే వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ ఫైనల్‌కు అర్హత సాధించగలం. అలాగే రెడ్ బాల్ క్రికెట్‌లో భారత్ తడబడుతోందని యావత్ ప్రపంచానికి తెలుసు. నిద్రపోతున్న వారిని లేపవచ్చు. కానీ నిద్ర నటిస్తున్నవారిని ఎప్పటికీ లేపలేం. వరల్డ్ టెస్ట్ ఛాంపియన్‌షిప్ టైటిల్‌ను భారత్ గెలుస్తుందని నేను అనుకోవడం లేదు. అసలు ఫైనల్ చేరుతుందనే గ్యారెంటీ కూడా నాకు లేదు.'అని సదగోపన్ రమేశ్ విమర్శించాడు. డబ్ల్యూటీసీ 2027 సైకిల్‌లో భారత్ ఇంకా 7 టెస్ట్‌లు ఆడాలి. ఇందులో భారత్ కనీసం 7 లేదా 6 మ్యాచ్‌లు గెలవాలి. ఒక్క మ్యాచ్‌లో కూడా ఓడిపోవద్దు. అప్పుడే భారత్ డబ్ల్యూటీసీ ఫైనల్ చేరగలదు. భారత్ తమ తదుపరి టెస్ట్ సిరీస్‌లను న్యూజిలాండ్, ఆస్ట్రేలియాతో ఆడనుంది. న్యూజిలాండ్ పర్యటనలో రెండు టెస్ట్‌లు, సొంతగడ్డపై ఆస్ట్రేలియాతో 5 టెస్ట్‌లు ఆడాల్సి ఉంది.

# కోహ్లీ ఆడి ఉంటే ఫలితం మరోలా ఉండేది

## మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ సూచన

శ్రీలంకతో రెండో టెస్ట్‌లో టీమిండియా స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ ఆడి ఉంటే ఫలితం మరోలా ఉండేదని మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ అన్నాడు. కోహ్లీ తన దూకుడైన స్వభావంతో ఆటగాళ్లను ఉత్తేజరిచేవాడని తెలిపాడు. కొలంబో వేదికగా గురువారం ముగిసిన రెండో టెస్ట్‌లో సోనాల్ దినుషా అజేయ శతకంతో శ్రీలంక ఓటమి నుంచి గట్టెక్కిన సంగతి తెలిసిందే. సునాయసంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌ను భారత్ చేజేతులా డ్రా చేసుకుంది. ఆఖరి రోజు ఆటలో నలుగురు బ్యాటర్లను ఔట్ చేయలేక మూల్యం చెల్లించుకుంది. ఈ మ్యాచ్ ఫలితంపై తన యూట్యూబ్ ఛానెల్ వేదికగా మాట్లాడిన కైఫ్.. కోహ్లీ ఉండి ఉంటే అతను అరుస్తూ ఆటగాళ్లను అప్రమత్తం చేసేవాడని చెప్పుకొచ్చాడు.'టెస్ట్ క్రికెట్ ఆడటం అందరికీ చాయ్ తాగినంత ఈజీ కాదు బాస్. ఇది చాలా సుదీర్ఘమైన ఆట. ఈ ఫార్మాట్‌లో నిరంతరం బౌలింగ్ చేస్తూనే ఉండాలి. ఒకవేళ ఈ మ్యాచ్ విరాట్ కోహ్లీ ఆడి ఉంటే.. అతను నిరంతరం అరుస్తూ జట్టును అప్రమత్తంగా ఉంచేవాడని నాకు అనిపించింది. కొన్ని సందర్భాల్లో మనం 'బౌలింగ్ చేస్తూ ఉంటే చాలు.. అదే జరుగుతుంది. బంతి చాలా టర్న్ అవుతోంది. దానంతట అదే వికెట్ పడుతుందిలే' అని అనుకుంటూ మ్యాచ్‌ను తేలిగ్గా తీసుకున్నామేమో అనిపించింది. భారత్ స్వయంగా సృష్టించుకున్న అవకాశాలు చాలా



తక్కువ. మన ఆటగాళ్ల ఎనర్జీ లెవెల్స్ కూడా చాలా తక్కువగా కనిపించాయి. అందుకే విరాట్ కోహ్లీ ఈ మ్యాచ్ ఆడి ఉంటే ఫలితం మరోలా ఉండేదని నేను అనుకుంటున్నా. ఎందుకంటే అతను 'కమాన్ సర్ఫరాజ్, కమాన్ జైస్వాల్' అంటూ ప్రతి ఒక్కరిలో ఉత్సాహాన్ని నింపేవాడు. అలాగే సోనాల్ దినూషాను కూడా వదిలేవాడు కాదు. తన స్లెడ్జింగ్‌తో రెచ్చగొట్టేవాడు. కానీ భారత్ ఆటగాళ్లు లాహిరు కుమారతో ఘర్షణకు దిగారు.'అని కైఫ్ అసహనం వ్యక్తం చేశాడు. సోనాల్ దినూషాను డీకోడ్ చేయడంలో భారత జట్టు పూర్తిగా విఫలమైందని కైఫ్ మండిపడ్డాడు. కవర్ డ్రైవ్ ఆడటంలో అతనికి ఇబ్బంది ఉన్నా.. ఆ దిశగా టీమిండియా బౌలింగ్ వ్యూహాలు కనిపించలేదన్నాడు. 'ప్రతీ బ్యాటర్‌కు ఏదో ఒక లోపం ఉంటుంది. ఆ లోపాన్ని కనుగొనడంలో భారత్ విఫలమైంది. నేను కేవలం శుభ్‌మన్ గిల్‌ను మాత్రమే నిందించడం లేదు. సోనాల్ దినుషా బలహీనతను పసిగట్టడంలో బౌలింగ్ విభాగంతో పాటు కోచింగ్ సిబ్బంది దారుణంగా విఫలమైంది. అతనికి ఒక్క డ్రైవ్ షాట్ బాల్ కూడా వేయలేదు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ తర్వాత డ్రైవ్ బాల్‌తోనే సోనాల్ దినూషాను సారాన్ష్ జైన్ ఔట్ చేశాడు. కానీ ఈ విషయాన్ని భారత బౌలర్లు మరిచిపోయారు. మహమ్మద్ సిరాజ్ ఫుల్ బాల్ వేసినా అతను తెలివిగా వదిలేసాడు. అతను షాట్లు ఆడటానికి ఏ మాత్రం ఇష్టపడలేదు. దినూషాను లైట్ తీసుకోవడంతోనే విజయం చేజారింది'అని కైఫ్ చెప్పుకొచ్చాడు.

# జపాన్ ఏర్పాట్లపై బీసీసీఐ తీవ్ర అసంతృప్తి



జపాన్ లోని ఐచి నగోయా వేదికగా సెప్టెంబర్ 19 నుంచి ప్రారంభం కానున్న ఏషియన్ గేమ్స్ క్రికెట్ ఈవెంట్ కు సంబంధించి భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) కీలక నిర్ణయం తీసుకునే దిశగా అడుగులు వేస్తోంది. అక్కడ క్రికెటర్ల కోసం చేసిన ఏర్పాట్లు, హోటల్ వసతులపై బీసీసీఐతో పాటు ఏషియన్ క్రికెట్ కౌన్సిల్ (ఏసీసీ)లో తీవ్ర అసంతృప్తి నెలకొంది. పరిస్థితులను సమీక్షించడానికి ఒక అబ్జర్వర్‌ను జపాన్ కు పంపాలని బోర్డు భావిస్తోంది. ఒకవేళ వసతులు ఏమాత్రం సరిగ్గా లేవని తేలితే ప్రధాన జట్టుకు బదులుగా 'బి' టీమ్ ను అక్కడికి పంపే అంశాన్ని బోర్డు పరిశీలిస్తోందని తెలుస్తోంది. జపాన్ లో క్రీడాకారులకు కల్పిస్తున్న సౌకర్యాలపై బీసీసీఐ వర్గాలు అన్ హేపీగా ఉన్నాయి. "ఏసీసీ సమావేశంలో జపాన్ ఒలింపిక్స్ నిర్వాహకులకు మా అభ్యంతరాలను తెలిపాం. క్రికెటర్ల కోసం డ్రెస్సింగ్ రూమ్ లను టెంట్లలో ఏర్పాటు చేశారు. పైగా వాష్ రూమ్స్ ఆ టెంట్ల నుంచి దాదాపు 500 మీటర్ల దూరంలో ఉన్నాయి. ఆటగాళ్లకు కేటాయించిన హోటల్ గదులు కూడా చాలా చిన్నవిగా ఉన్నాయి" అని బోర్డు ప్రతినిధి తెలిపాడు. అబ్జర్వర్ ఇచ్చే గ్రౌండ్ రిపోర్ట్ ఆధారంగా తుది నిర్ణయం తీసుకోనున్నారు. మహిళల క్రికెట్ ఈవెంట్ సెప్టెంబర్ 17 నుంచి 22 వరకు, పురుషుల విభాగం మ్యాచ్ లు సెప్టెంబర్ 24 నుంచి అక్టోబర్ 3 వరకు నిర్వహిస్తారు. చైనాలో చివరిసారిగా జరిగిన ఏషియన్ గేమ్స్ లో గోల్డ్ మెడల్ గెలిచిన ఇండియా, ఈసారి కూడా టైటిల్ నిలబెట్టుకోవడానికి శ్రేయస్ అయ్యర్ కెప్టెన్సీలో బలమైన స్క్వాడ్ ను ప్రకటించింది. ఈ జట్టులో వైస్ కెప్టెన్ గా తిలక్ వర్మ ఉండగా, సంజూ శాంసన్, అభిషేక్ శర్మ, ఇషాన్ కిషన్, శివమ్ దూబే, వైభవ్ సూర్యవంశీ, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, నితీష్ కుమార్ రెడ్డి, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, స్టార్ పేసర్లు జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్ ఆడతారు. మహిళల విభాగానికి కెప్టెన్ గా హర్మన్‌ప్రీత్ కౌర్, వైస్ కెప్టెన్ గా స్మృతి మంధాన వ్యవహరిస్తున్నారు.

# టీమిండియాపై మహమ్మద్ కైఫ్ ఆగ్రహం

శ్రీలంకతో రెండో టెస్ట్‌ను డ్రా చేసుకున్న టీమిండియాపై మాజీ క్రికెటర్ మహమ్మద్ కైఫ్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. భారత్ విజయానికి అడ్డుగా నిలిచిన సోనాల్ దినుషా బలహీనతను పసిగట్టడంలో జట్టు మొత్తం విఫలమైందని మండిపడ్డాడు. ఇదేం కబ్ల్ మ్యాచ్ కాదని, డేటా అనలిస్ట్, కోచ్‌లు ఏ చేస్తున్నారని ప్రశ్నించాడు. సోనాల్ దినుషాను ఔట్ చేసే విషయంలో కోచ్‌గా గంభీర్.. కెప్టెన్‌గా శుభ్‌మన్ గిల్ విఫలమయ్యారని అభిప్రాయపడ్డాడు. కొలంబో వేదికగా గురువారం ముగిసిన రెండో టెస్ట్‌లో సోనాల్ దినుషా అజేయ శతకంతో శ్రీలంక ఓటమి నుంచి గట్టెక్కింది. మరోవైపు సునాయసంగా గెలవాల్సిన ఈ మ్యాచ్‌ను భారత్ చేజేతులా చేజార్చుకుంది. ఆఖరి రోజు ఆటలో నలుగురు బ్యాటర్లను ఔట్ చేయలేక మూల్యం చెల్లించుకుంది. ఈ మ్యాచ్ ఫలితంపై అధికారిక బ్రాడ్‌కాస్టర్ సోటీ టీవీ షోలో మాట్లాడిన కైఫ్.. గిల్‌సేనపై ఘాటు విమర్శలు చేశాడు. 'ప్రతీ బ్యాటర్‌కు ఏదో ఒక లోపం ఉంటుంది. ఆ లోపాన్ని కనుగొనడంలో భారత్ విఫలమైంది. నేను కేవలం శుభ్‌మన్ గిల్‌ను మాత్రమే నిందించడం లేదు. సోనాల్ దినుషా బలహీనతను పసిగట్టడంలో బౌలింగ్ విభాగంతో పాటు కోచింగ్ సిబ్బంది దారుణంగా విఫలమైంది. అతను గాలే టెస్ట్‌లోనే సెంచరీ చేశాడు. కాబట్టి అతన్ని ఔట్ చేసేందుకు పకడ్బందీ ప్రణాళికల




గురించి చర్చ చేయాలి కదా? ఈ టెస్ట్‌లో వ్యూహాత్మకంగా టీమిండియా బలహీనంగా కనిపించింది. అటాకింగ్ ఫీల్డ్ సెటప్ చేయలేదు. ఫీల్డింగ్‌ను ఓపెన్‌గా పెట్టారు. ఒక్క డ్రైవ్ షాట్ బాల్ కూడా వేయలేదు. తొలి ఇన్నింగ్స్‌లో సెంచరీ తర్వాత డ్రైవ్ బాల్‌తోనే సోనాల్ దినూషాను సారాన్ష్ జైన్ ఔట్ చేశాడు. కానీ ఈ విషయాన్ని భారత బౌలర్లు మరిచిపోయారు. మహమ్మద్ సిరాజ్ ఫుల్ బాల్ వేసినా అతను తెలివిగా వదిలేసాడు. అతను షాట్లు ఆడటానికి ఏ మాత్రం ఇష్టపడలేదు. ఇక ఇదేం క్లబ్ మ్యాచ్ కాదు. ఇంటర్నేషనల్ గేమ్. జట్టులో ఒక వీడియో అనలిస్ట్, డేటా ఎక్స్‌పర్ట్, ఆరు నుంచి ఏడుగురు కోచ్‌లు ఉన్నారు. సోనాల్ దినూషాను ఔట్ చేసే ప్రణాళికలు రచించకుండా వీరంతా ఏం చేస్తున్నారు.. భారత యువ బౌలర్లకు ఇలాంటి పిచ్‌పై ఆడిన అనుభవం లేదు. టెస్ట్‌ల్లో వారు ఐదో రోజు ఎక్కువగా బౌలింగ్ చేయలేదు. ఎందుకంటే టెస్ట్ మ్యాచ్‌లు ఇంత సుదీర్ఘంగా ఎక్కువగా జరగవు. దాంతోనే ఏం చేయాలో భారత బౌలర్లకు అర్థం కాలేదు. అంతేకాకుండా సోనాల్ దినుషాను భారత జట్టు పెద్దగా పట్టించుకోలేదనే విషయం అర్థమవుతుంది.

రెండో మ్యాచ్‌లోనూ అదే పొరపాటు చేశారు. రెండో టెస్ట్‌లో అతను ఒక్క కవర్ డ్రైవ్ బౌండరీ సాధించలేదు. పుల్, స్వీప్, రివర్స్ స్వీప్ షాట్స్ మాత్రమే ఆడాడు.

కానీ ఒక్క కవర్ డ్రైవ్ షాట్ ఆడలేదు. అతను ఆ షాట్ ఆడేలా భారత బౌలర్లు కూడా బంతులు వేయలేదు. షార్ట్ పిచ్ బాల్స్ వేసి పరుగులు సమర్పించుకున్నారు.'అని మహమ్మద్ కైఫ్ అసహనం వ్యక్తం చేశాడు.

# దూసుకుపోతున్న ఇరుముడి

## గ్రామీణ ప్రాంతాల్లో భారీగా టిక్కెట్ల అమ్మకం




మాస్ మహారాజా రవితేజ నటించిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఇరుముడి' బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతూ మరో అరుదైన ఘనతను తన ఖాతాలో వేసుకుంది. విడుదలైనప్పటి నుంచి వరుసగా రికార్డులు సృష్టిస్తున్న ఈ చిత్రం తాజాగా ఆన్‌లైన్ టికెట్ విక్రయాల్లో సరికొత్త మైలురాయిని చేరుకుంది. ప్రముఖ టికెటింగ్ ఎ÷–లాట్‌ఫార్మ్‌లైన బుక్‌మైషో, డిస్ట్రిక్ట్ యాప్స్ ద్వారానే 'ఇరుముడి'కి 55 లక్షలకు పైగా టికెట్లు అమ్ముడయ్యాయి. ఒక ప్రాంతీయ చిత్రానికి ఈ స్థాయిలో టికెట్ సేల్స్ నమోదు కావడం ట్రేడ్ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. రవితేజ మాస్ అప్పీల్, ఎమోషనల్ డ్రామా, యాక్షన్ ఎపిసోడ్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటుండటంతో థియేటర్లలో ప్రేక్షకుల రద్దీ కొనసాగుతోంది. ఫ్యామిలీ ఆడియన్స్ నుంచి మాస్ ప్రేక్షకుల వరకు అన్ని వర్గాల నుంచి మంచి ఆదరణ లభిస్తుండటంతో సినిమా కలెక్షన్ల పరంగా కూడా దూసుకుపోతోంది. బాక్సాఫీస్ వద్ద ఇప్పటికే బ్లాక్‌బస్టర్‌గా నిలిచిన 'ఇరుముడి' ఇప్పుడు టికెట్ విక్రయాల్లోనూ తన సత్తా చాటుతూ కొత్త రికార్డులను లక్ష్యంగా పెట్టుకుంది. ప్రస్తుతం చిత్రానికి ఉన్న జోరు చూస్తుంటే రాబోయే రోజుల్లో మరిన్ని మైలురాళ్లు అందుకోవడం ఖాయమనే అభిప్రాయం ట్రేడ్ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

## నేడు కింగ్ 100 టైటిల్ గ్లింప్స్ విడుదలకు సిద్ధం



టాలీవుడ్ కింగ్ అక్కినేని నాగార్జున పుట్టినరోజు సందర్భంగా ఆయన కెరీర్‌లో వందో మైలురాయిగా నిలుస్తున్న ప్రతిష్టాత్మక 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన అదిరిపోయే అప్‌డేట్ వచ్చేసింది. యువ దర్శకుడు రా. కార్తీక్ దర్శకత్వంలో అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై ఈ చిత్రం అత్యంత ప్రతిష్టాత్మకంగా తెరకెక్కుతోంది. ఇక ఈ ప్రాజెక్ట్‌కు రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు. నాగార్జున పుట్టినరోజు కానుకగా ఆగస్టు 29 ఉదయం 9 గంటలకు 'కింగ్ 100' సినిమాకు సంబంధించిన టైటిల్ గ్లింప్స్ విడుదల చేయనున్నట్లు మేకర్స్ అధికారికంగా ప్రకటించారు. ఫాస్టెన్ యువర్ సీట్‌బెల్ట్స్ రేపటి నుంచి కింగ్ ఆధిపత్యం మొదలవ్వబోతోంది అంటూ చిత్ర యూనిట్ సోషల్ మీడియాలో పంచుకున్న ఈ అనౌన్స్‌మెంట్ ప్రస్తుతం అక్కినేని అభిమానుల్లో భారీ అంచనాలను పెంచుతూ సోషల్ మీడియాలో ట్రెండ్ అవుతోంది.



# 'మహిళలను ఇలా చూపిస్తారా'..

## 'టాక్సిక్'పై అన్నామలై ఫైర్

యశ్ నటించిన 'టాక్సిక్' సినిమాలో మహిళలను అతిగా లైంగికంగా చూపించారని బీజేపీ మాజీ నేత కె. అన్నామలై తీవ్రంగా విమర్శించారు. ఇలాంటి చిత్రాలకు 'సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్' (సీబీఎఫ్‌సీ) ఎలా అనుమతి ఇచ్చిందని ప్రశ్నించారు. సినిమాల్లో చూపించే సన్నివేశాల విషయంలో సెన్సార్ నిబంధనలను మరింత కఠినతరం చేయాలని అన్నారు. మహిళలను ఒకే కోణంలో చూపించే సినిమాలు పిల్లలపై తీవ్ర ప్రభావం చూపుతాయని అన్నామలై ఆందోళన వ్యక్తం చేశారు. మహిళల భద్రతపై సమాజంలో అవగాహన కల్పిస్తున్న సమయంలో ఇలాంటి చిత్రాలకు అనుమతి ఇవ్వడం సరికాదన్నారు. మహిళలకు సంబంధించిన అంశాలపై జరుగుతున్న కృషిని ఇలాంటి సినిమాల చిత్రీకరణ దెబ్బతీస్తుందని వ్యాఖ్యానించారు. 'టాక్సిక్' విడుదలైన తొలి రోజే రూ.104 కోట్ల వసూళ్లు సాధించిందని అన్నామలై పేర్కొన్నారు. పెద్ద హీరోలు నటించిన సినిమాల విషయంలోనూ సెన్సార్ బోర్డు గట్టి నిర్ణయాలు తీసుకోవాలని సూచించారు. కాగా, సినిమాపై వస్తున్న విమర్శలను హీరో యశ్ తిప్పికొట్టారు. దర్శకురాలు గీతూ మోహన్‌దాస్‌ను సమర్థించారు. ట్రైలర్ చూసి సినిమాపై అభిప్రాయానికి రావద్దని కోరారు. సినిమాలో మహిళలకు బలమైన గొంతు ఉందని చెప్పారు. అమ్మాయిలు థియేటర్లకు వెళ్లి సినిమా చూడాలని పిలుపునిచ్చారు. 'టాక్సిక్' గ్యాంగ్‌స్టర్ నేపథ్యంలో తెరకెక్కింది. యశ్ ద్విపాత్రాభినయం చేసిన ఈ చిత్రంలో నయనతార, తారా సుతారియా, కియారా అద్వానీ, హ్యూమా ఖురేషీ, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో నటించారు



## శర్వానంద్ 'భోగి'లో ఐదుగురు అక్కాచెల్లెళ్లు..

### రాఖీ రోజున సర్‌ప్రైజ్ ఇచ్చిన డైరెక్టర్!

శర్వానంద్ హీరోగా దర్శకుడు సంపత్ నంది తెరకెక్కిస్తున్న యాక్షన్ ఎంటర్‌టైనర్ 'భోగి'పై ఆసక్తి మరింత పెరుగుతోంది. రాఖీ పండుగ సందర్భంగా సినిమాలో శర్వానంద్ పోషిస్తున్న గంగ పాత్రకు ఐదుగురు అక్కాచెల్లెళ్లు ఉన్నారని దర్శకుడు వెల్లడించారు. ఐదుగురు సోదరీమణులతో గంగ ఉన్న పోస్టర్‌ను సోషల్ మీడియాలో షేర్ చేసిన సంపత్ నంది.. వారిని 'భోగి'కి ఆత్మలాంటి పాత్రలుగా అభివర్ణించారు. "ఫైవ్ సిస్టర్స్.. వన్ వరల్డ్.. వన్ హార్ట్‌బీట్" అంటూ రాఖీ శుభాకాంక్షలు తెలిపారు. ఇటీవలే సినిమాకు మరో కొత్త పాటను రికార్డ్ చేసినట్లు సంపత్ నంది వెల్లడించారు. ఆస్కార్ అవార్డు విజేత చంద్రబోస్ సాహిత్యం, భీమ్స్ సిసిరోలియో సంగీతంతో రూపొందిన ఈ పాటను 'టైమ్‌లెస్ జెమ్'గా దర్శకుడు పేర్కొన్నారు. 'భోగి' కోసం ఇప్పటికే భారీ యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరిస్తున్నారు. జులైలో 22 రోజుల పాటు వరుసగా క్లైమాక్స్ షూటింగ్ నిర్వహించారు. భారీ సెట్‌లో చిత్రీకరించిన ఈ సన్నివేశంలో 800 మందికి పైగా జూనియర్ ఆర్టిస్టులు పాల్గొన్నట్లు చిత్రబృందం తెలిపింది. యాక్షన్ కొరియోగ్రఫీని దిలీప్ సుబ్బరాయన్ రూపొందించారు. గంగ పాత్ర కోసం శర్వానంద్ రోజూ రెండున్నర గంటలకు పైగా మేకప్ వేసుకోవడంతో పాటు, షూటింగ్ పూర్తయ్యాక దాదాపు గంట సమయం మేకప్ తొలగించుకోవడానికి పట్టేదని సమాచారం. ఈ సినిమాలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి కథానాయికలుగా నటిస్తున్నారు. అనుపమ.. కందుల సులోచన రాణి పాత్రలో, డింపుల్.. మందారం పాత్రలో కనిపించనున్నారు.

## 18న వస్తోన్న అనుమాన పక్షి




డిజె టిల్లు'తో సెన్సేషనల్ డెబ్యూను అందుకున్న దర్శకుడు విమల్ కృష్ణ రెండో సినిమా 'అనుమాన పక్షి'. రాగ్ మయూర్ హీరోగా ఈ సినిమాను రాజీవ్ చిలక, రాజేశ్ జగ్తియాని, హీరాచంద్ దండ్ నిర్మించారు. తొలి చిత్రం తరహాలోనే ఈ సినిమానూ యునిక్ కామెడీ ఎంటర్ టైనర్ గా విమల్ కృష్ణ తెరకెక్కించారు. తమ 'అనుమాన పక్షి' చిత్రం సెప్టెంబర్ 18న థియేటర్లలోకి రానుందని చిత్ర నిర్మాతలు అధికారికంగా ప్రకటించారు. ఈ సందర్భంగా విడుదల తేదీని తెలియజేస్తూ ఓ ఆసక్తికరమైన పోస్టర్‌ను విడుదల చేశారు. సినిమా విభిన్నమైన టోన్‌తో పాటు హీరో విచిత్రమైన ఆలోచనా విధానాన్ని ఈ పోస్టర్ ప్రజెంట్ చేస్తోంది. రాగ్ మయూర్ సంప్రదాయ దుస్తుల్లో చేతిలో రైఫిల్ పట్టుకుని కనిపిస్తున్నారు. ఆయన పక్కనే ఉన్న బ్లాక్‌బోర్డుపై 'డౌట్స్ అండర్ ఇన్వెస్టిగేషన్' అనే టైటిల్‌తో జీవితం, విధి, కర్మ, దేవుడి ఎ÷–లానింగ్స్ కు సంబంధించిన ఆసక్తికరమైన ప్రశ్నలను పొందుపరిచారు. 'ఒన్ బోయ్. బిలియన్ థాట్స్, జీరో చిల్' అనే ట్యాగ్‌లైన్ ఆయన పాత్రలోని ఆలోచనా విధానాన్ని మరింత ఆసక్తికరంగా తెలియజేస్తోంది.

-------

## రేస్-4 కు అమీర్ గ్రీన్ సిగ్నల్



బాలీవుడ్ స్టార్ హీరో ఆమిర్ ఖాన్ చాలా రోజుల తర్వాత కొత్త ప్రాజెక్ట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు సమాచారం. ప్రముఖ యాక్షన్ ఫ్రాంచైజీ 'రేస్' నాలుగో భాగంలో ఆయన నటించనున్నట్లు బాలీవుడ్ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. 'రేస్ 4' స్క్రిప్ట్ ఆమిర్ ఖాన్‌కు బాగా నచ్చడంతో ఆయన ఈ ప్రాజెక్ట్‌ను చేయడానికి నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. అంతేకాకుండా, ఈ చిత్రానికి దర్శకత్వం వహించే బాధ్యతలను ప్రముఖ దర్శకుడు విజయ్ కృష్ణ ఆచార్యకు అప్పగించినట్లు సమాచారం. గతంలో ఆమిర్ ఖాన్, విజయ్ కృష్ణ ఆచర్య కాంబినేషన్‌లో వచ్చిన 'ధూమ్ 3' సినిమా భారీ విజయం సాధించిన విషయం తెలిసిందే. దీంతో ఈ ప్రాజెక్ట్‌ను విజయ్‌కి ఇవ్వబోతున్నట్లు సమాచారం. కాగా.. త్వరలోనే దీనికి సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది.

--------

## మిత్రుడు నారాయణరావు పార్థివదేహానికి నివాళి అర్పించిన చిరంజీవి..



రచయిత, నటుడు, తన మిత్రుడు జీవీ నారాయణరావు భౌతికకాయానికి మెగాస్టార్ చిరంజీవి నివాళులర్పించారు. ఆయన పార్థివ దేహానికి పూలమాల వేసి అంజలి ఘటించిన చిరంజీవి... అనంతరం నారాయణరావు కుటుంబ సభ్యులను పరామర్శించి సానుభూతిని తెలిపారు. తన ఆప్తమిత్రుడితో ఉన్న దశాబ్దాల సుదీర్ఘ అనుబంధాన్ని, చివరి జ్ఞాపకాలను ఈ సందర్భంగా గుర్తుచేసుకుంటూ తీవ్ర భావోద్వేగానికి లోనయ్యారు. 1977 నుంచి తమ ఇద్దరి మధ్య పరిచయం ఉందని, ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో శిక్షణ పొందుతున్న సమయంలో నారాయణరావు తమకు సీనియర్ విద్యార్థిగా ఉండే వారని చిరంజీవి తెలిపారు. అప్పట్లోనే ఆయన తన నటనా అనుభవాలను తమతో పంచుకుంటూ ఎంతో చొరవగా ఉండేవారని చెప్పారు. ఆ తర్వాత ఇండస్ట్రీలోకి అడుగుపెట్టి ఎవరి సినిమాల్లో వారు బిజీ అయిపోయామని తెలిపారు. తన కొన్ని చిత్రాల్లోనూ నారాయణరావు కీలక పాత్రలు పోషించారని గుర్తుచేశారు. ఆ తర్వాత వ్యక్తిగత, వృత్తిపరమైన బాధ్యతల వల్ల ఇద్దరి మధ్య కొంత గ్యాప్ వచ్చినట్లు పేర్కొన్నారు.

నారాయణరావుతో తనకు జరిగిన చివరి కలయిక గురించి చెబుతూ చిరంజీవి మరింత భావోద్వేగానికి గురయ్యారు. కేవలం పది రోజుల క్రితమే తాము నటించిన 'మంచుపల్లకి' చిత్రాన్ని మళ్లీ చూశానని తెలిపారు. ఆ సినిమా స్ఫూర్తితోనే ఐదుగురు కొత్తవారితో ఒక కొత్త కథను రాసుకున్నానని నారాయణరావు తనతో చెప్పారని వెల్లడించారు.



## అమ్మానాన్నల కష్టం చూశా.. అందుకే సినిమాల్లోకి : అనంతిక

'మ్యాడ్' చిత్రంతో తెలుగు ప్రేక్షకులకు పరిచయమై, '8 వసంతాలు' సినిమాతో యువతకు మరింత చేరువైన నటి అనంతిక సనిల్‌కుమార్. ప్రస్తుతం ఆమె నటించిన 'రోమాంచకం' చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. సెప్టెంబర్ 3న విడుదల కానున్న ఈ సినిమా ప్రమోషన్లలో భాగంగా అనంతిక తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తన కుటుంబ నేపథ్యం, కెరీర్‌లో ఎదుర్కొన్న సవాళ్ల గురించి పలు ఆసక్తికర విషయాలను పంచుకున్నారు.

చిన్నప్పటి నుంచి తనకు కళలంటే ఎంతో ఇష్టమని, ఆరో తరగతి నుంచే నృత్య ప్రదర్శనల్లో పాల్గొనేదాన్నని అనంతిక తెలిపారు. "ఒక ప్రదర్శన ఇవ్వాలంటే ఎంతో ఖర్చయ్యేది. మా కుటుంబం ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నప్పటికీ, అమ్మానాన్నలు నన్ను ఎప్పుడూ నిరుత్సాహపరచలేదు. అప్పులు చేసి మరీ నన్ను ఈవెంట్లకు పంపించేవారు. ఆ కష్టాలను నేను ప్రత్యక్షంగా చూశాను, ఆ బాధేంటో నాకు తెలుసు. వారిని గొప్పగా చూసుకోవాలనే లక్ష్యంతోనే చిత్ర పరిశ్రమలోకి వచ్చాను" అని ఆమె వివరించారు.

కెరీర్ ప్రారంభంలో తన రూపం కారణంగా కొన్ని భారీ ప్రాజెక్టులను వదులుకోవాల్సి వచ్చిందని అనంతిక పేర్కొన్నారు. "ఫొటోలు చూసి చిన్నపిల్లలా కనిపిస్తున్నావంటూ తిరస్కరించేవారు. నా లుక్స్ వల్లే నాని గారి 'ది ప్యారడైజ్' సినిమాలో అవకాశం కోల్పోయాను. అవకాశాలు చేజారినప్పుడు బాధ కలిగినా, ఏది జరిగినా సానుకూలంగా ముందుకు సాగడమే నా నైజం. 'రోమాంచకం' తప్పకుండా విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది. మనకు రాసిపెట్టింది ఖచ్చితంగా దక్కుతుంది" అని ఆమె ధీమా వ్యక్తం చేశారు.

Printed , Published and Owned by Marepally Ashok , Printed at Dilip Offset Printers, H.NO. 4-110, Durga Nagar, Dilsukhnagar, Hyderabad , Ranga Reddy District -500060 and Published from H. No 18-353/1,Vijaya Nagar Colony, Hajipally Road, Farooq Nagar, Ranga Reddy District — 509216 Telangana State. Editor : Marepally Ashok, RNI.No :TELTEL/2023/85745. E mail id : ashok.laghs123@gmail.com. Cell. No: 8978701613